VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K, U.S.A., New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI MEMBER QEAC No. E334
1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
+91(40) 27628104, 27674007
victoria.ashoknagar@gmail.com
www.victoriaoverseas.com


# ప్రజాప్రశ్న
తెలుగు దినపత్రిక


MAHESH KUMAR KOVURY CELL 9885624338
STOOP TAILORS&TEXTILES
SUITING,SHIRTING&READYMADES
MEN'S WEAR&KID'S WEAR
18-3-4, BESIDE OLD POLICE STATION, CHATRINAKA

సంపుటి: 3 సంచిక: 318, పేజీలు - 08
ఆదివారం, మార్చి 3, 2024 వెల: 5 రూ/.
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati



## బీఆర్ఎస్, కాంగ్రెస్ కన్నా బీజేపీ టిక్కెట్లకే
# ఫుల్ డిమాండ్
### తెలంగాణలో కమలం జోరు మీద ఉందా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ బీజేపీలో ఈ సారి టిక్కెట్ల కోసం భారీ పోటీ నెలకొంది. పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతాపార్టీ మూడోసారి విజయం సాధించి, మోదీ ప్రధానమంత్రిగా హ్యాట్రిక్ విజయం సాధిస్తారని నమ్మకం బలంగా ఉంది. ఈ క్రమంలో తెలంగాణలో బీజేపీలో చేరేందుకు పలు పార్టీల నాయకులు ఆసక్తి చూపిస్తున్నారు. నరేంద్రమోదీని మూడో సారి ప్రధానమంత్రిని చేసేందుకు అధిక ఎంపీ స్థానాలు గెలవాలనే లక్ష్యంతో వరుస యాత్రలు చేపడుతున్న తెలంగాణ బీజేపీ నేతలు బలమున్న బీఆర్ఎస్ నేతలకు గాలం వేశారని సమాచారం. నాగర్ కర్నూలు సిట్టింగ్ బీఆర్ఎస్ ఎంపీ రాములు, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ రెండు రోజుల తేడాతో బీజేపీలో చేరిపోయారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలై గ్రాఫ్ కోల్పోయిన బీఆర్ఎస్ అభ్యర్థిగా కంటే ప్రచారంలో ముందున్న బీజేపీ ఎంపీగా బరిలోకి దిగేందుకు వీరు ఆసక్తి చూపిస్తున్నారు. వీరితో పాటు ఆదిలాబాద్, మెదక్, ఖమ్మం జిల్లాలకు చెందిన ఒకరిద్దరు కీలక నేతలు కూడా బీజేపీలో చేరే అవకాశముంది.

### ఉత్తర తెలంగాణలో సీట్ల కోసం భారీ పోటీ

ఆదిలాబాద్ పార్లమెంటు స్థానంలో పరిధిలో బీజేపీకి గత అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు స్థానాలు దక్కాయి. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ కాగజ్ నగర్ అసెంబ్లీ సీట్లలో బీజేపీ అభ్యర్థులు ఘనవిజయం సాధించడంతో ఆదిలాబాద్ ఎంపీ స్థానం బీజేపీకి అనుకూలంగా ఉందని ఆ పార్టీ జరిపిన సర్వేలోనూ తేలింది. దీంతో సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు అభ్యర్థిత్వంపై బీజేపీ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీ, మాజీమంత్రి గెడం నగేష్ బీజేపీలో చేరి పోటీ చేయాలనుకుంటున్నారు. ఆదిలాబాద్ ఎంపీ సీటును తనకే ఇవ్వాలని మాజీ ఎంపీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు రమేష్ రాథోడ్ కోరుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి సానుకూల వాతావరణం ఉందని సర్వేలు వెల్లడించడంతో తెలంగాణలోని రిజర్వ్డ్ సీట్లలో టికెట్ల కోసం ఆ పార్టీ నేతల నుంచి పోటీ నెలకొంది. ఆదిలాబాద్, మహబూబాబాద్ పార్లమెంట్ స్థానాలు ఎస్టీలకు, వరంగల్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి ఎంపీ సీట్లను ఎస్సీ అభ్యర్థులకు రిజర్వు చేశారు.

### భారీ పోటీతో నేతల మధ్య వివాదాలు

బీజేపీ నాయకుల మధ్య ఎంపీ టికెట్ల పంచాయతీ నెలకొంది. మహబూబాబాద్ సీటును బీజేపీకి చెందిన హుసేన్ నాయక్ ఆశిస్తుండగా ఇతర పార్టీ నుంచి నేతను చేర్చుకొని టికెట్ ఇవ్వాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. నాగర్ కర్నూల్ సీటు కోసం ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి బంగారు శృతి ఆసక్తి చూపిస్తుండగా, బీఆర్ఎస్ సిట్టింగ్ ఎంపీ రాములు పార్టీలో చేరారు. వరంగల్ సీటు కోసం మాజీ ఐపీఎస్ కృష్ణప్రసాద్ పోటీ పడుతుండగా బీఆర్ఎస్ నాయకుడిని చేర్చుకొని ఆయనను అభ్యర్థిగా రంగంలోకి దించాలన్న చర్చ జరుగుతోంది. పెద్ద పల్లి ఎంపీ స్థానం కోసం కుమార్, మిట్టపల్లి సురేందర్ లు పోటీ పడుతున్నారు. ఈ సారి రిజర్వ్డ్ స్థానాల కోసం బీజేపీతో పాటు ఇతర పార్టీల నేతలు కూడా ఆసక్తి చూపిస్తున్నారు. వికసిత భారత్, విజయ సంకల్ప యాత్రల పేరిట బీజేపీ ప్రచారంలో దూసుకుపోతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే వివిధ కార్యక్రమాలతో కమలనాథులు ప్రజల్లోకి వెళుతున్నారు. మోదీ పదేళ్లలో సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వల్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా రాజకీయ వాతావరణం ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

6లో ▶

## కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఈసారి ఐదు గ్యారంటీలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రెండు నెలల్లో జరిగే లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో సిద్ధమవుతోంది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి దేశంలో మారిన పరిస్థితులు, కేంద్రంలో బలంగా ఉన్న అధికార ఎన్డీయేను ఢీకొట్టాల్సిన పరిస్థితుల్లో ఉన్న కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో కీలక హామీల్ని సిద్ధం చేస్తోంది. ఇందులో రైతులు డిమాండ్ చేస్తున్న కనీస మద్దతు ధరకు చట్టబద్ధత, బీసీ కులాలు కోరుతున్న కుల గణనతో పాటు మరిన్ని సంచలన హామీలు ఉండబోతున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేత చిదంబరం అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ దీనికి తుదిరూపు ఇచ్చేందుకు కసరత్తు చేస్తోంది. ఈసారి మ్యానిఫెస్టోలో దేశంలో ఉన్న నిరుద్యోగాన్ని దృష్టిలో ఉంచుకుని భారీ ఎత్తున ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ హామీ కూడా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. రాహుల్ భారత్ న్యాయ్ యాత్రలో చెబుతున్న పంచ్ న్యాయ్ (ఐదు న్యాయాలు)ను ఐదు గ్యారంటీల రూపంలో ఓటర్లకు హామీలుగా ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. సోమవారం చిదంబరం అధ్యక్షతన సమావేశమవుతున్న

6లో ▶

## ఇళ్లు లేని వారికి
# గుడ్‌న్యూస్
### త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం

- ఈ పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- అర్హులైన లబ్ధిదారునికి సొంత ఇంటి స్థలం లేకుంటే స్థలం, రూ.5 లక్షలు ఇవ్వనున్న ప్రభుత్వం
- ఇప్పటికే పలు పథకాలు ప్రారంభించిన తెలంగాణ ప్రభుత్వం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో 6 గ్యారంటీల్లో భాగంగా హామీ ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మార్చి 11న కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టనుంది. ఇందుకు సంబంధించి నిబంధనలు, విధి విధానాలు రూపొందించాలని అధికారులను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

6లో ▶

## అంగన్వాడీల్లో సీసీ కెమెరాలు
### - బయోమెట్రిక్ హాజరుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, బయోమెట్రిక్ హాజరు ఉండేలా చూడాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సచివాలయంలో మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు. అంగన్వాడీల్లో

6లో ▶

# వైఎస్ఆర్‌సీపీలో జాబితాల గందరగోళం
### - ఇది కూడా వ్యూహమేనా.?

**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకూ ఎనిమిది జాబితాలు విడుదల చేసింది. ఏడు జాబితాలు విడుదల చేసిన తర్వాత దాదాపుగా కసరత్తు అయిపోయిందని ఒకటీ అరా మార్పులు ఉంటాయని జగన్ పార్టీ క్యాడర్ తో జరిగిన మీటింగ్‌లో చెప్పారు. కానీ తర్వాతి రోజే.. కొంత మందిని మారుస్తూ ఎనిమిదో జాబితా ఇచ్చారు. అందులో ప్రకటించిన వారినే మళ్లీ మళ్లీ మార్పులు చేశారు. దీంతో అయిపోలేదని ఇంకా ఉన్నాయన్న సంకేతాలు వినిపిస్తూనే ఉన్నాయి. తుది జాబితాలో ఉండేవారే అభ్యర్థులు. ఇప్పటికీ నియమిస్తున్నది సమన్వయకర్తలేనని వైవీ సుబ్బారెడ్డి గతంలో ప్రకటించారు. దీంతో గందరగోళం మరింత రెట్టింపు అయింది.



### ప్రతి ఒక్కరిపైనా టిక్కెట్ లేదనే ప్రచారాలు

ఇటీవల కొడాలి నానికి గుడివాడలో టిక్కెట్ లేదంటూ జరిగిన ప్రచారం ఏపీ వ్యాప్తంగా హైలెట్ అయింది. ఆయనను గన్నవరం పంపుతున్నారని ఇప్పటికీ ప్రచారం జరుగుతోంది. కొడాలి నాని లాంటి లీడర్ కే ఈ పరిస్థితి ఉంటే పార్టీలో మరే నేతకూ టిక్కెట్ గ్యారంటీ లేనట్లే. ఈ గందరగోళం సుదీర్ఘంగా సాగుతోంది. జాబితాలు ప్రకటించిన వారికి టిక్కెట్ కన్ఫర్మ్ అని చెప్పడం లేదు. వారి స్థానాల్లోనూ రోజుకో పేరు తెరపైకి వస్తోంది. మైలవరం నుంచి తిరుపతిరావు అనే నేతను ఇంచార్జ్ గా ప్రకటించారు కానీ తాజాగా టీడీపీ నుంచి చేరిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావుకు ఇస్తారని అంటున్నారు. పెనుమలూరు విజయవాడ ఎంపీ ఇలా అనేక స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు టెన్షన్ కు గురవుతున్నారు ప్రచారం చేసుకోవాలా చివరికి క్షణంలో పేర్లు మార్చేస్తారా అని ఆందోళనకు గురవుతున్నారు. కానీ ఖచ్చితంగా మీరే అభ్యర్థి వైసీపీ హైకమాండ్ ఇంత వరకూ ఎవరికీ చెప్పడం లేదు.

### బీఫాం ఇచ్చే వరకూ ఎవరికీ గ్యారంటీ లేదా.?

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ

6లో ▶

## 195 మందితో లోక్‌సభ ఎన్నికల
# అభ్యర్థుల తొలి జాబితా విడుదల

- వారణాసి నుంచి మళ్లీ ప్రధాని మోదీ పోటీ
- గాంధీ నగర్ నుంచి అమిత్ షా, విదిశ నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ పోటీ
- యువతకు, మహిళలకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత
- తెలంగాణ నుంచి 9 మందికి సీట్ల ఖరారు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల జాబితాపై ఇన్నాళ్ల సస్పెన్స్‌కి తెర దించుతూ బీజేపీ ఫస్ట్ లిస్ట్‌ని విడుదల చేసింది. 195 అభ్యర్థులతో కూడిన ఈ జాబితాని వినోద్ తావడే విడుదల చేశారు. ఈ లిస్ట్‌లో మొత్తం 34 మంది మంత్రులున్నారు. 57 మంది ఓబీసీలకు అవకాశమిచ్చింది హైకమాండ్. యువతకు 47 స్థానాలు కేటాయించినట్టు వినోద్ తావడే వెల్లడించారు. ఎస్సీలకు 27, ఎస్టీలకు 18 సీట్లు కేటాయించారు. మొత్తం అభ్యర్థుల్లో 28 మంది మహిళలకు అవకాశమిచ్చారు. బెంగాల్‌లో 20, మధ్యప్రదేశ్‌లో 24, గుజరాత్‌లో 15, రాజస్థాన్‌లో 15 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. యూపీలో 51, కేరళలో 12 సీట్లు, తెలంగాణలో 9 సీట్లు, అసోంలో 11, ఝూర?ండ్‌లో 11, ఛత్తీస్ గఢ్‌లో 11, ఢిల్లీలో 5 సీట్లు, జమ్మూ కశ్మీర్‌లో 2, ఉత్తరాఖండ్‌లో, 2, అరుణాచల్ ప్రదేశ్‌లో, గోవాలో 1, త్రిపురలో 1, అండమాన్ నికోబార్‌లో 1,

6లో ▶


# యాదాద్రి కాదు ఇక యాదగిరిగుట్ట
### - త్వరలో జీవో ఇస్తామన్న మంత్రి కోమటరెడ్డి



**నల్గొండ (ప్రశ్న న్యూస్)** యాదాద్రి కాదు ఇకపై యాదగిరిగుట్టగా పిలువబుడుతుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. యాదాద్రి పేరును యాదగిరి గుట్టగా మారుస్తూ త్వరలోనే జీఓ విడుదల చేస్తామని కోమటిరెడ్డి వెల్లడించారు. ఆయన శనివారం మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'ఎమ్మెల్యే కేటీఆర్ ఇప్పటికీ తండ్రి కేసీఆర్ చాటు కొడుకే. నేను ఉద్యమాలు చేసి వచ్చాను. మేం జీరో బిల్ ఇచ్చినట్టు కేటీఆర్‌కి జీరో నాలెడ్జ్ ఉంది. నాలెడ్జ్ లేని కేటీఆర్ గురించి మాట్లాడడం వృథా. ఫ్లోర్ లీడర్ ఇవ్వకపోతే హరీష్ కూడా బీజేపీలోకి

6లో ▶

## జగన్ ఇంటికెళ్లడం
# ఖాయం
### - గురజాల సభలో చంద్రబాబు



**పల్నాడు (ప్రశ్న న్యూస్)** నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయల టీడీపీలో చేరారు. ఆయనతో పాటు మరికొందరు నేతలు టీడీపీలోకి వచ్చారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో నిర్వహించిన రా కదలిరా సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో లావు శ్రీకృష్ణదేవరాయలు తెలుగుదేశం పార్టీలో చేరారు. లావు శ్రీకృష్ణదేవరాయలుకు టీడీపీ అధినేత చంద్రబాబు పార్టీ కండువా కప్పారు. యువ ఎంపీని టీడీపీలోకి సాదర స్వాగతం పలికారు. భుజం తట్టి అభినందించారు. పల్నాడు జిల్లా గురజాల నియోజకవర్గంలోని దాచేపల్లిలో శనివారం రా కదలిరా సభ ఏర్పాటు చేశారు. ఈ సభలో టీడీపీ అధినేత

6లో ▶

# టీఎస్ఆర్టీసీకి అవార్డుల పంట
### - టీఎస్ఆర్టీసీకి జాతీయ స్థాయి అవార్డులు
### - నాలుగు కేటగిరిల్లో మనమే ఫస్ట్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకి జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్స్‌లెన్స్ అవార్డులు టీఎస్ఆర్టీసీని వరించాయి. 2022-23 ఏడాదికి గానూ రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత వినియోగం కేటగిరిల్లో టీఎస్ఆర్టీసీ అగ్రస్థానంలో నిలిచింది. రహదారి భద్రతలో, ఇంధన సామర్థ్య నిర్వహణ మొఫిషిల్ విభాగంలో, సిబ్బంది సంక్షేమం, ఉత్పత్తి కేటగిరిలో, సాంకేతికత ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించిన విభాగాల్లో టీఎస్ ఆర్టీసీకి ప్రథమ బహుమతులు లభించాయి. కాగా అర్బన్ విభాగంలో ద్వితీయ బహుమతిని టీఎస్ఆర్టీసీ

6లో ▶

# ఆధ్యాత్మిక శోభ సంతరించుకునేలా

## ఏడుపాయల జాతర ఉత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు

### జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

### స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రమేష్





**మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్)** ఈ నెల 08 నుండి 10 వరకు మూడు రోజుల పాటు వైభవోపేతంగా నిర్వహించనున్న ఏడు పాయల జాతర ఏర్పాట్ల ప్రగతి పై శనివారం జాతర ఆవరణ గల హరిత హెూటల్ నందు జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో రమాదేవి దేవాదాయ కార్యనిర్వహణ అధికారి మోహన్ రెడ్డి, , ఆలయ చైర్మన్ బాల గౌడ్ , తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర, సంబంధిత ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలీస్ ఎక్సైజ్, లీగల్ మెట్రాలజీ, ఆర్టీసీ, ఫైర్, మెడికల్, విద్యుత్, మత్స్యశాఖ, వెటర్నరీ, సంబంధిత అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రెవిన్యూ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎలాంటి లోటుపాట్లు కలుగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయవలసినదిగా అధికారులకు సూచించారు. భక్తుల నుండి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా ఉండడమే జాతర విజయవంతానికి నాంది అని అన్నారు, కాబట్టి అధికారులు సమిష్టిగా, సమన్వయంతో ఈ నాలుగు రోజులు మరింత కష్టపడి పనిచేయాలని, సమయం దగ్గర పడుతున్నందున అన్ని పనులు పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రతి ఒక్కరు పిన్ పాయింట్ వారీగా రోజు వారి షిఫ్ట్ ప్రకారంసిబ్బందికి విధులు కేటాయించి, పాసులు జారీ చేయాలని తద్వారా సిబ్బంది విదులు సమర్ధవంతగా నిర్వహిస్తారని అన్నారు బ్యారీ కేడింగ్ , సీసీ కెమెరాల ఏర్పాటు పారిశుధ్యం పై ఎక్కువమంది పారిశుధ్య కార్మికులను నియమించుకోవాలని, షవర్లు, మంచినీటి కుళాయిలు శౌచాలయాలు అన్ని వినియోగంలో ఉండేలా చూడాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని, జిల్లా నలుమూలల నుండే గాక ఇతర ప్రాంతాల నుండి బస్సులు నడపాలని, గజ ఈతగాళ్లు, వైద్య ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రమేష్ మాట్లాడుతూ వివిధ శాఖల మధ్య ఉన్న చిన్న సమన్వయ లోపాలను పరిష్కరించుకొని పకడ్బందీగా జాతర నిర్వహించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆలయంలో భక్తులకు త్వరగా దర్శనం లభించే విధంగా క్యూలైన్ నిర్వహించాలని, భక్తులతో సిబ్బంది ఎక్కడ దురుసుగా ప్రవర్తించవద్దని, చాలా సహనంతో విధులు నిర్వహించాలని చెప్పారు ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత దుర్వాసన ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వివిఐపి దర్శనాల్లో ఆలయ మర్యాదలను పాటించాలని ఆలయ ఈఓ ను ఆదేశించారు జాతర సమయంలో కట్టుదిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు.

డీఎస్పీ రాజేశ్వర్ మాట్లాడుతూ ఏడుపాయల జాతరలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడానికి జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పగడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామనిప్రతి ఏరియాలో పోలీస్ సిబ్బంది ప్రజలకు రక్షణగా అందుబాటులో ఉంటారని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారుఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, డి ఆర్ డి ఓ,శ్రీనివాసరావుఏడి మైన్స్ జయరాజ్, మత్స్యశాఖ అధికారి నరసింహారావు, , ఆర్టీసీ డిఎం సుధ, ఇండస్ట్రీస్ జిఎం కృష్ణమూర్తి, ఈ .ఈ పి ఆర్ నరసింహులు, ఆర్ అండ్ బిఈ .ఈ సర్దార్ సింగ్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

# కట్టుదిట్టమైన భద్రత, ప్రశాంత వాతావరణ నడుమ ఇంటర్మీడియట్ పరీక్షలు

### అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రమేష్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) శనివారం మెదక్ జిల్లాలోని ప్రభుత్వ బాలికల కళాశాల, గీతా జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టామని, అన్నారు. ప్రభుత్వ బాలికల కళాశాల మెదక్ పరీక్షా కేంద్రంలో నేడు 230 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 218 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారని 12 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు .అలాగే గీతా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో 363 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 338 మంది మాత్రమే పరీక్ష రాస్తున్నారని 25 మంది హాజరు కాలేదని అన్నారు పరీక్షా కేంద్రాల్లో సౌకర్యాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# విద్యార్థి దశలో పదవ తరగతి కీలకం..!!

### రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) బీబీపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థినులకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వైస్ చైర్మన్ అంకన్నగారి నాగరాజ్ గౌడ్ స్థానిక ఎస్ఐ ప్రభాకర్ తో కలిసి పరీక్ష అట్టలను పంపిణీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి జిల్లా వైస్ చైర్మన్ నాగరాజ్ గౌడ్ మాట్లాడుతూ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇష్టపడి చదివి పరీక్షలు రాస్తే ఉజ్వల భవిష్యత్తు వుంటుందన్నారు భయం వీడనాడి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని అనుకున్న లక్ష్యాన్ని చేరాలంటే సాధన అవసరమన్నారు విద్యార్థి దశలో పదవ తరగతి పరీక్షలు మొదటి మెట్టని ఒక మలుపు లాంటిదని శ్రద్ధగా చదివి పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు ఎస్ఐ ప్రభాకర్ మాట్లాడుతూ నేను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి వచ్చానని పరీక్షలు బాగా రాసి ఉత్తమ పలితాలు సాధిస్తే అటు విద్య నేర్పిన ఉపాధ్యాయులకు, జన్మనిచ్చిన తలిదండ్రులకు మంచి పేరు తెచ్చిన వారవుతారని సూచించారు రెడ్ క్రాస్ మండల చైర్మన్ దాత బాశెట్టి నాగేశ్వర్ సహకారంతో వీటిని అందజేసినట్లు తెలిపారు ప్రిన్సిపాల్ మంగ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మా విద్యార్థినులకు పరీక్షా అట్టలు అందించినందుకు పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మంగ, మండల చైర్మన్ బాశెట్టి నాగేశ్వర్, వైస్ చైర్మన్ స్వామీ , మండల ఎంసీ మెంబర్లు వెంకట్ రెడ్డి, బాలరాజు,నాగరాజు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలపై ఆటపాటలతో అవగాహన

## సాంస్కృతిక సారథి కళాకారుల ప్రదర్శన



వాజేడు (ప్రశ్న న్యూస్ ) కలెక్టర్, డిపిఆర్ఓ ఆదేశాల మేరకు వాజేడు మండలంలోని జగన్నాథపురం గుమ్మడిదొడ్డి గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి మార్త రవి బృందం చేత అరుగ్యారంటీలపై అవగాహన కార్యక్రమం చేపట్టడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 6 గ్యారంటీల పైన ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలనీ అర్హులైన వాళ్ళందరూ సమీప అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకుని పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సారథి కళాకారులు ప్రజలకు అర్ధమయ్యే రీతిలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాకారుల టీం లీడర్ మార్త రవి, రాగుల శంకర్ ఎండి రహీముద్దీన్ ఈర్ల సాగర్ కనకం రాజేందర్ గోల్కొండ బుచ్చన్న బోడ కిషన్ రేలా విజయ్ రామంచ సురేష్ అమ్మపాట తిరుపతి రేలా కుమార్ ఉంద్రతి భాస్కర్ గోల్కొండ నరేష్ కామెర దీపక్ మొగిలిచెర్ల రాము శ్రీలత శోభ లు పాల్గొన్నారు.

# నిజాంపేట్ 2వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 2వ డివిజన్‌లో చేపట్టిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా విచ్చేసి స్థానిక మేయర్ కొలన్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్ యాదవ్, 2వ డివిజన్ కార్పొరేటర్ చిట్ల దివాకర్‌లతో కలిసి ప్రారంభించారు. 1) రూ. 99 లక్షల వ్యయంతో విజయ దుర్గ కాలనీ జిపిఆర్ లేఅవుట్‌లో సీసీ రోడ్, 2) రూ. 62 లక్షల వ్యయంతో హెచ్ఎండబ్ల్యుఎస్ మంజీర వాటర్ పైప్ లైన్ పనులు, 3) రూ. 18 లక్షల వ్యయంతో సింహపురి కాలనీ మెయిన్ రోడ్‌లో గల ట్రైల్కో నుండి సూర్య రెసిడెన్సి వరకు సీసీ రోడ్, 4) రూ. 47 లక్షల వ్యయంతో రుద్ర కుటీర్ నుండి ప్లాట్ నె. 20 రాయల్ విలేజ్ అండ్ లోహిత అపార్ట్మెంట్స్ వెనకవైపు వరకు సీసీ రోడ్, 5) రూ. 26 లక్షల వ్యయంతో ఎస్విఎల్ఎన్ అపార్ట్మెంట్స్ నుండి సుమన్ నిలయం వరకు అదేవవిధంగా సాయి ఎలైట్ రెసిడెన్సీ నుండి ప్లాట్ నెం. 4, 5 నుండి శ్రీ చైతన్య రెయిన్‌బో క్యాంపస్ కాంపౌండ్ వాల్ వరకు సీసీ రోడ్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవాలు జరిగాయి. అదేవిధంగా నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు కళాశాల రోడ్‌లో రూ. 10 లక్షల వ్యయంతో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి స్థానిక మేయర్ కొలన్ నీలారెడ్డితో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన నగర అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని, రానున్న రోజుల్లో మౌలిక వసతుల కల్పనకు మరిన్ని నిధులు కేటాయిస్తూ కుత్బుల్లాపూర్‌లోని అన్ని ప్రాంతాలను వేగవంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, సీనియర్ నాయకులు కొలన్ గోపాల్‌రెడ్డి, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, దుండిగల్ కౌన్సిలర్లు, ఎన్ఎంసీ కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఎన్ఎంసీ బిఆర్ఎస్ అధ్యక్షులు, ఆయా డివిజన్ అధ్యక్షులు, అనుబంధ కమిటీల సభ్యులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు, మహిళా నాయకురాళ్లు ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కైలాసద్వారం వద్ద ఏర్పాట్ల పరిశీలించిన ఈఓ పెద్ది రాజు

### భక్తులందరు కూడా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం





శ్రీశైలం ( ప్రశ్న న్యూస్)నంద్యాల మరియు కర్నూలు జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో కార్యనిర్వహణాధికారి సంభాషించడం జరిగింది. కాలిబాట మార్గములో మంచినీటి వసతి, ఆయా ప్రదేశాలలో శౌచాలయాల ఏర్పాటు, భక్తులు కల్పిస్తున్న అన్నదానం మొదలైనవాటి గురించి కార్యనిర్వహణాధికారి భక్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులందరు కూడా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. కాగా కైలాసద్వారం వద్ద దేవస్థానం విశాలమైన చలువపందిర్లను (తాత్కాలిక షెడ్లు) వేయడంతో పాటు మంచినీటి వసతి, తాత్కాలిక విద్యుద్దీకరణ మొదలైన వాటిని ఏర్పాటు చేయడం జరిగింది. అదేవిధంగా కైలాసద్వారం వద్ద దేవస్థానం అన్నప్రసాదాలను కూడా అందజేస్తోంది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ కైలాసద్వారం వద్ద భీమునికొలను మెట్ల మార్గంలో నిరంతరం మంచినీటి సరఫరా జరుగుతుండాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. ముఖ్యంగా కైలాసద్వారం వద్ద గల 20వేల లీటర్ల సామర్థ్యపు శాశ్వత మంచినీటిట్యాంకు (ఆర్.సి.సి ట్యాంకు)నకు నిరంతరం మంచినీటిని సరఫరా జరుగుతుండాలన్నారు. అదేవిధంగా కైలాసద్వారం వద్ద గతంలో వలెనే 5వేల లీటర్ల సామర్థ్యం గల మరో 8 సింటెక్స్ ట్యాంకులు ఏర్పాటు చేయబడ్డాయి. ముఖ్యంగా కైలాసద్వారం నుండి భీమునికొలను మార్గములో 1000 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకులను 7 చోట్ల ఏర్పాటు చేయబడ్డాయి. అదేవిధంగా కైలాసద్వారం మరియు పరిసరాలను, భీమునికొలను మెట్ల ప్రారంభ ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తుండాలని పారిశుధ్య విభాగాన్ని ఆదేశించారు. ఈ పరిశీలనలో అసిస్టెంట్ ఇంజనీర్లు రాజేశ్వరరావు, సీతారమేష్, రంగప్రసాద్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# లిటిల్ మిరాకిల్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

### -ముఖ్య అతిథిగా పాల్గొన్న కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి



కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట్‌లో శనివారం లిటిల్ మిరాకిల్ స్కూల్ 2వ వార్షికోత్సవం, ఇంగ్లీష్ స్కాలర్ స్కూల్ 14వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ వేడుకలకు భౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కౌన్సిలర్ మౌనిక విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి దీపారాధన చేసి వేడుకల్ని ప్రారంభించారు. అనంతరం ఇంగ్లీష్ స్కాలర్ స్కూల్లో జరిగిన వార్షికోత్సవంలో పాల్గొని చిన్నారుల నృత్యాలను తిలకించారు. చిన్నారులందరికి కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రజకుల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న రియల్టర్ అవినాష్

### - పోలీసులకు పిర్యాదు చేసిన రజకులు





కీసర (ప్రశ్న న్యూస్)గతంలో మేడ్చల్ జిల్లా కీసర దాయర రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 212 లో ఉన్న చాకలిలక్ష్మయ్య కుంటకు పక్కన ఉన్నల్యాండ్ ఓనర్ రియల్టర్ అవినాష్ కబ్జా చేయాలని చూస్తున్నాడని, కుంటను మట్టితో కూడిపేసి మాదేనని బుకాయిస్తూ అన్యాయంగా అక్రమంగా కబ్జా చేయాలని కుట్ర పన్ని స్థానికులను, రజకులను భయ భ్రాంతులకు గురిచేస్తున్నారని రజకులు ,ప్రజలు ఇచ్చిన పిర్యాదుకు స్పందించిన హెచ్.ఎం.డీ.ఏ అధికారులు సర్వే చేసి కుంటను ఎఫ్టీఎల్ ను వదిలేసి వెంచర్ చేసుకోవాలని ఆదేశించడంతో సదరు రియల్టర్ తనకు నష్టం జరిగిందని భావించి నేడు పక్కన ఉన్న 214 సర్వేనెంబర్లో ఉన్న రజకుల భూమిని కబ్జా చేయాలని చూస్తున్నాడని రజకులు ఆవేదన వ్యక్తం చేశారు. తనకు సంబంధం లేని 214 సర్వే నెంబర్ లో ఉన్న భూమిలోని సరిహద్దులు, హద్దులు తొలగిస్తున్నారని, రియల్టర్ అవినాష్ అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి జేసీబీ సహాయంతో సరిహద్దులు చెరిపేసి హద్దులు, కడీలను తొలగించి తమ భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని రజకులు ఆరోపించారు. పైగా అడ్డొస్తే దాడులు చేస్తాం, చంపుతామని బెదిరిస్తున్నారని వాపోయారు.దీనిపై పోలీసులకు పిర్యాదు చేశామని వారు తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఎలాగైనా కబ్జాకు పాల్పడుతున్న అవినాష్ అతని అనుచరులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని రజకులు, ప్రజలు కోరుతున్నారు.

## సంపాదకీయం

# గాలిలో ప్రజా ఆరోగ్య భద్రత

తినే తిండి, పీల్చేగాలి, తాగే నీరు సురక్షితంగా, నాణ్యంగా, ఆరోగ్యకరంగా ఉండాలని కోరుకోనివారుండరు. మనిషికి కనీస అవసరాలైన ఇందులోని ఏఒక్కటి కల్తీ అయినా అది ప్రాణాలకే ప్రమాదం..ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న నిత్యావసర వస్తువులను కృత్రిమంగా తయారు చేసి.. కల్తీని ప్రజలకు విక్రయిస్తున్నారు. మరోపక్క నగరంలోని హోటళ్లలో కూడా కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తున్నారు. కల్తీ ఆహారపదార్థాల బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నా.. అధికార యంత్రాంగం నిద్ర మత్తులో ఉన్నదని విమర్శలొస్తున్నాయి. నకిలీ కొబ్బరి నూనె, మసాల, కిరాణా సరకులకు సంబంధించిన గుట్టును రట్టు చేశారు. కానీ, స్వార్థమే పరమావధి, లాభాలే అసలైన లక్ష్యంగా మారిన సమాజంలో సర్వం కల్తీమయం చేస్తున్నారు కొందరు ప్రబుద్ధులు. ఆహారపదార్థాల్లో ఉపయోగించే మాసాల దినుసుల్లోని గసగసాలు, మిర్యాలు, లవంగాలు, డ్రైఫ్రూట్స్, పిండి, బియ్యం.. అన్ని రకాల వస్తువులు నకిలీవి చేస్తున్నారు.మానవాళికే ప్రమాదకరంగా మారిన ఈ కల్తీని సమర్థవంతంగా నిరోధించి, కల్తీసురుల ఆటకట్టించే చట్టాలే కరువయ్యాయి. కోటికి పైగా జనాభా వున్న హైదరాబాద్‌లో గడిచిన రోజు ఓ అంతర్జాతీయ ప్రముఖ కంపెనీ చాక్లెట్‌లో తెల్లపురుగు వుందని నాచారంలోని రాష్ట్ర ఆహార ప్రయోగశాల నిర్ధారించడం, బేగంబజార్ కేంద్రంగా రూ. 5 లక్షలు విలువ చేసే అల్లం, వెల్లుల్లి కల్తీ పేస్టు ముఠాను పట్టుకోవడం సర్వం కల్తీమయాన్ని నిరూపిస్తున్నది.నేషనల్ క్రైమ్స్ బ్యూరో ఇటీవల 19 నగరాల్లో ఆహార నాణ్యతపై తనిఖీలు చేయగా హైదరాబాద్ దేశంలోనే 246 కేసులతో అగ్రస్థానంలో నిలిచిందని, ఇది దేశ వ్యాప్త కేసుల్లో 84 శాతమని బ్యూరో గణాంకాలతో సహా ప్రకటించడం ఆరోగ్యరంగ నిపుణులను ఆందోళనపరుస్తోంది. ఇంటి బయట ఏది తినాలన్నా కల్తీ భయం సాధారణ ప్రజలను తీవ్రంగా కలవరపరుస్తున్నది. అత్యధిక జనసాంద్రత, వేలాది హోటళ్ళున్న హైదరాబాద్‌లో ఆహార కల్తీని నిరోధించే అధికారులు కేవలం 30 మంది మాత్రమే ఉన్నారంటే నియంత్రణ పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. సర్వం కల్తీతో పాలితులు కల్తీ ఆహారం తిని కడుపు సంబంధిత వ్యాధులు, కేన్సర్, డయాబెటిస్, గుండె వైఫల్యం, పెరాలసిస్ వంటి సుదీర్ఘ జబ్బులతో బాధితులుగా మారినా పాలకుల్లో ఆహార కల్తీ నియంత్రణపై చీమకుట్టినట్లయిన లేకపోవడం, అధికారులు మౌన ప్రేక్షకుల్లా మూగనోము పాటించడం క్షమించరాని నేరమే. 2006లోనే ఆహార భద్రత, ప్రమాణాల చట్టం తీసుకు వచ్చినా అది కాగితాలకే పరిమితమైంది. వీధి ఆహార దుకాణాల నుంచి ఫైవ్ స్టార్ హోటళ్ళ దాకా కల్తీసురులు చట్టంపై భయంలేక విశృంఖలంగా వీరవిహారం చేస్తున్నారు.సహజ సిద్ధంగా పొలాల్లో పండిన పంటల నుంచి వచ్చే ఆహార పదార్థాలను తినడం వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అయితే, ఈ సహజ సిద్ధంగా పండే పంటల నుంచి వచ్చే ఆహారపదార్థాలు కాకుండా.. కొందరు కృత్రిమంగానే తయారు చేస్తున్నారు. ఇందుకు కొన్ని కెమికల్స్‌ను ఉపయోగిస్తున్నారు, హైడ్రోజన్ ఫెరాక్సైడ్ వంటి కెమికల్స్‌ను కలిపి.. ఈ నకిలీ వస్తువులు తయారు చేస్తున్నారు. జిలకర్ర, సాజిర, బాదం, లవంగాలు, ఇలాచీలు, గసగసాలు, మిర్యాలు, కర్రం పొడి, పసుపు, గోదుమ పిండి, నూడిల్స్.. ఇలా ఒకటేమిటి ఇంటిలోని వంట గదిలో ఉండే ఆహార పదార్థాల తయారీకి ఉపయోగించే వస్తువులన్నీ నకిలీవి తయారు చేస్తున్నారు. మేమున్నామంటూ.. అప్పుడప్పుడు పోలీసులు దాడులు చేస్తుంటారు. ఏడాదికోసారి ఫుడ్‌సేఫ్టీ అధికారులు కూడా.. మేం సైతం.. అంటూ దాడులు చేస్తుంటారు. పూర్తిస్థాయిలో మాత్రం అటు పోలీసులు, ఇటు ఫుడ్‌సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. రాజస్థాన్, గుజరాత్ నుంచి వచ్చిన వాళ్లే కృత్రిమంగా నకిలీ పదార్థాలు తయారు చేస్తూ.. విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్టు తయారీకి వాడిన నాసిరకం ముడిపదార్థాలు, వాటికి రంగు, రుచి, వాసన రావడానికి వాడిన కెమికల్స్, అవి తయారైన పరిసరాల పరిశుభ్రతను పరిశీలిస్తే ఒళ్ళుగగుర్పొడుస్తోంది. కల్తీ తయారీదారులు అల్లం, వెల్లుల్లి పేస్టును బ్రాండ్ల పేరు, ఐఎస్ఐ ముద్రతోనే రాష్ట్ర వ్యాప్తంగా పేరున్న స్టోర్లకు కూడా పంపిణీ చేస్తున్నారని పోలీసులు చేసిన ప్రకటన చూస్తే వణికిపోని వారుండరంటే అతిశయోక్తి కాదు. పాలు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, వెన్న, మయోనీజ్, సాస్, కోవా, బియ్యం, చాక్లెట్లు లాంటి నిత్యావసర వస్తువుల నాణ్యతపై హైదరాబాద్ నగర పాలక సంస్థ ఆహార కల్తీ నిరోధక విభాగానికి ప్రతి రోజూ వందలాది ఫిర్యాదులు అందుతున్నాయంటే కల్తీ తీవ్రత ఎంతగా విస్తృతమవుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఆహార కల్తీని కూడా విధాన నిర్ణేతలు ప్రాధాన్యతా అంశంగా తీసుకొని వివిధ దేశాల్లో ఆదర్శప్రాయంగా వున్న చట్టాలను అక్కడి మాదిరిగా సంస్కరించి కఠిన శిక్షలు కల్తీసురులకు పడే విధంగా చూస్తే తప్ప కల్తీల ఆగడాలు ఆగవు.ఆహార కల్తీ చట్టం, అందులో భాగంగా ఏర్పాటైన యంత్రాంగాలు వీధివీధినా పెరిగిన ఆహార కేంద్రాలను ఎప్పటికప్పుడు నిఘా పెట్టి తనిఖీ చేసే పరిస్థితులు లేవు. పాలకులే మేల్కొని ఆహార కల్తీ నిరోధాన్ని అత్యవసరంగా తీసుకొని అందుకు తగిన కఠిన కార్యాచరణ అవలంబిస్తే తప్ప కల్తీ మహమ్మారిని పారద్రోలలేము. ఇప్పుడు సరైన యంత్రాంగం లేక అక్కడక్కడా, అప్పుడప్పుడూ ఆహార కల్తీ నిరోధక అధికారులు చేసే తనిఖీలు, పెట్టే కేసులు తూతూ మంత్రంగానే వున్నాయి. ఎక్కడా కేసులు పెట్టకపోవడం, పెట్టినా శిక్షలు నామమాత్రంగా కూడా లేకపోడవడంతో కల్తీ అనేది కుటీర పరిశ్రమగా మారింది. లాభమే తప్ప మనిషి ఆయుష్షుని పట్టించుకోని పరిస్థితి సర్వత్రా నెలకొన్నది. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇంటి బయట ఉత్పత్తి అయ్యే ప్రతి పదార్థం లోని వాటిని ముడి పదార్థాలు, వాటి వల్ల ఆరోగ్యానికి సంభవించే లాభనష్టాలు లాంటివి పకడ్బందీగా ప్యాకింగ్‌లోనే ముద్రిస్తారు. ఆహార చట్టాల ఉల్లంఘనను తీవ్రంగా పరిగణించి శిక్షలు కూడా త్వరిత గతిన పడేలా యంత్రాంగాలను ఏర్పాటు చేశారు.

# డయాలసిస్ అంటే


## – 30 ఏళ్ల వరకు జీవనం పొడిగింపు – ఈలోగా కొత్త ఆవిష్కరణలు

## – ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితం – ఖమ్మం ఆదర్శం


**(అనంచిన్ని బ్రాడ్ కాస్టింగ్)**

డయాలసిస్ అనగానే గుండె గుభేలుమంటుంది! మరణానికి చేరువైపోయామోననే భావన కలుగుతుంది! అందరికీ తెలిసిపోతుందేమోననే బాధ మొదలవుతుంది! నిజంగానే డయాలసిస్ అంత భయంకరమైనదా.? దాని అవసరం ఎంత మేరకు.?

మూత్రపిండాలు మొరాయిస్తే, వాటి పనిని యంత్రాలకు అప్పగించడమే డయాలసిస్! చిటికేసినంత త్వరగా, తేలికగా డయాలసిస్ గురించి చెప్పేసుకోవచ్చు. కానీ ఆ స్థితికి చేరుకోవడానికి మాత్రం మూత్రపిండాలు చాలాకాలంపాటు ఇబ్బంది పడతాయి. దాదాపు 80 శాతం పాడయ్యేవరకూ కిడ్నీలు తమ విధిని సక్రమంగానే నిర్వహిస్తాయి. ఆ తర్వాత నుంచి క్రమక్రమంగా పని చేయడానికి మొండికేస్తాయి. దాన్నే 'కిడ్నీ ఫెయిల్యూర్' అంటారు. ఆ సమయంలో 'డయాలసిస్' తప్ప వేరే ప్రత్యామ్నాయం ఉండదు.







### రెండు రకాల ఫెయిల్యూర్లు!:

కొంతమందిలో కిడ్నీలు తాత్కాలికంగా పని చేయడం మానేసి, మూల కారణాన్ని సరిచేస్తే, తిరిగి శక్తి పుంజుకుని పూర్వస్థితికి చేరుకుంటాయి. ఈ స్థితిని 'టెంపరరీ కిడ్నీ డ్యామేజ్' అంటారు. మరికొందరిలో కిడ్నీలు పూర్తిగా పాడైపోయి పనికిరాకుండా పోతాయి. ఈ స్థితిని 'పర్మనెంట్ కిడ్నీ డ్యామేజ్' అంటారు. ఈ రెండు పరిస్థితులకూ వేర్వేరు కారణాలుంటాయి.

టెంపరరీ కిడ్నీ డ్యామేజ్

**డీహైడ్రేషన్:** వరుస వాంతులు, విరేచనాల కారణంగా శరీరంలో నీటి శాతం తగ్గి 'డీహైడ్రేషన్'కు గురయినప్పుడు మూత్రపిండాలు తాత్కాలికంగా పని చేయడం మానేసే అవకాశం ఉంటుంది.

**పెయిన్ కిల్లర్స్:** నొప్పి తగ్గించే మందులు విపరీతంగా వాడినా ఈ స్థితి వచ్చే అవకాశం ఉంటుంది.

**ఇన్‌ఫెక్షన్లు:** మూత్రాశయ, ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్లు శరీరంలో విస్తరించినా ఈ పరిస్థితి వస్తుంది.

**గుండెకు రక్తప్రసరణ:** కొన్ని కారణాల వల్ల గుండెకు రక్తప్రసరణ కుంటుపడినా, మూత్రపిండాలకు కూడా రక్తప్రసరణ తగ్గి డ్యామేజ్ అవుతాయి.

పర్మనెంట్ కిడ్నీ డ్యామేజ్.. మధుమేహం: దీర్ఘకాలంపాటు సక్రమంగా మందులు వాడకుండా, ఆహార నియమాలు పాటించకుండా రక్తంలో చక్కెర స్థాయిలు అదుపు తప్పినప్పుడు మూత్రపిండాలు శాశ్వతంగా పని చేయడం మానేస్తాయి.

**అధిక రక్తపోటు:** దీర్ఘకాలం పాటు అధిక రక్తపోటు సమస్యకు మందులు వాడకపోయినా ఆ ప్రభావం మూత్రపిండాల మీద పడి అవి శాశ్వతంగా పాడైపోతాయి. **ఆటో ఇమ్యూన్ డిసీజ్:** శరీర రక్షణ వ్యవస్థ తన మీద తానే దాడి చేసుకునే రుగ్మత వల్ల కూడా కిడ్నీలు శాశ్వతంగా పాడయ్యే అవకాశం ఉంటుంది. జన్యుపరమైన కారణాలు: కొన్ని రకాల జన్యుపరమైన కారణాల వల్ల కూడా మూత్రపిండాలు శాశ్వతంగా పాడవుతాయి.

### డయాలసిస్ ఇలా!:

తాత్కాలికం, శాశ్వతం%8ా% మూత్రపిండాలు ఎలా పని చేయడం మొరాయించినా వాటికి ప్రత్యామ్నాయ మార్గంగా డయాలసిసను అనుసరించక తప్పదు. అయితే ఇందుకోసం కిడ్నీలు పాడయిన తీరునుబట్టి రెండు రకాల డయాలసిస్ లను ఎంచుకోవచ్చు. అవేంటంటే%8ా

### హీమో డయాలసిస్:

ఈ డయాలసిస్ ను ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలోనే చేయించుకోవాలి. ఇందుకు నాలుగు గంటల సమయం పడుతుంది. ఈ డయాలసిస్ ను వారంలో మూడు సార్లు చేయించుకోవడం తప్పనిసరి. రోగి రక్తాన్ని వడపోసే మిషన్ ఆధారంగా శరీరం నుంచి వ్యర్థాలను తొలగించే ప్రక్రియ ఇది. ఇందుకోసం రోగి ఆస్పత్రికి వచ్చి నాలుగు గంటలపాటు మిషన్ దగ్గరే బెడ్ మీద పడుకునే ఉండాలి.

**పెరిటోనియల్ డయాలసిస్:** ఆస్పత్రికి రాలేని వృద్ధులు, ఆస్పత్రి సౌకర్యం లేని గ్రామాల్లో ఉండే రోగులు ఇంటి దగ్గరే స్వయంగా చేసుకోగలిగే డయాలసిస్ ఇది. పొట్ట లోపలికి అమర్చిన రెండు ట్యూబ్‌ల ద్వారా డయాలసిస్ ద్రవాన్ని పంపించి, వ్యర్థాలను బయటకు రప్పించే ప్రక్రియ ఇది. ఈ డయాలసిస్ రోజుకు మూడు సార్లు చేసుకోవాలి. ఒక్కో డయాలసిస్ కు నాలుగు గంటల సమయం పడుతుంది. అయితే అంత సమయంపాటు రోగి పడుకునే ఉండవలసిన అవసరం లేదు.

### డయాలసిస్ ఎప్పుడంటే..:

కిడ్నీలు ఇన్‌ఫెక్షన్‌కు గురై తాత్కాలికంగా పని చేయడం మానేస్తే, అందుకు దారితీసిన కారణాలను సరిదిద్దడం ద్వారా తిరిగి మూత్రపిండాలను పని చేయించవచ్చు. అయితే ఆ లోగా కిడ్నీలకు విశ్రాంతినివ్వాలి. ఈ కోవకు చెందిన టెంపరరీ కిడ్నీ డ్యామేజ్‌కు గురయిన వారు హీమో డయాలసిస్ చేయించుకోవలసి ఉంటుంది. శాశ్వతంగా మూత్రపిండాలు పాడయిన వారు నొప్పి కలిగించని, హీమో డయాలసిస్, కానీ పెరిటోనియల్ డయాలసిస్ కానీ జీవితాంతం చేయించుకుంటూ ఉండాలి.

### డయాలసిస్ చేయించుకోకపోతే?:

డయాలసిస్ చేయించుకోకుండా ఉండిపోతే మూత్రపిండాలు నీటిని వడగట్టలేక, నీరు ఊపిరితిత్తుల్లోకి చేరి 'పల్మనరీ ఎడీమా' తలెత్తవచ్చు. ఆయాసం, ఊపిరి ఆడకపోవడం లాంటి సమస్యలతో అత్యవసర వైద్య చికిత్స అవసరం పడవచ్చు. రక్తంలో పొటాషియం స్థాయులు పెరిగిపోయి, హఠాత్తుగా గుండె ఆగిపోవచ్చు. మెదడు ఇన్‌ఫెక్షన్‌కు గురై మూర్ఛలు మొదలవవచ్చు. రోగి కోమాలోకి కూడా వెళ్లిపోయే ప్రమాదం ఉంటుంది.

### పదేళ్ల నుంచి 30 ఏళ్ళ వరకు ఎక్కువ బతకచ్చు!:

వైద్యులు సూచించిన మేరకు ఆరోగ్య పరిస్థితిని బట్టి డయాలసిస్ చేయించుకుంటే 60 నుంచి 70 మంది జీవితకాలం పదేళ్ల నుంచి 30 ఏళ్ళ వరకు పెరుగుతుంది. మూడుసార్లకు బదులు రెండుసార్లే చేయించుకుంటూ ఉండడం వల్ల అనారోగ్యానికి గురవడంతోపాటు జీవితకాలం తగ్గిపోతుంది.

అధిక రక్తపోటు రూపంలో%8ా%యుక్తవయస్కుల్లో మూత్రపిండాలు పాడయితే, రక్తపోటు పెరిగిపోతుంది. అయితే పెరిగిన రక్తపోటు అదే స్థితిలో కొనసాగకుండా తగ్గుతూ పెరుగుతూ ఉంటుంది. ఈ లక్షణం కనిపిస్తే ఆలస్యం చేయకుండా మూత్రపిండాలను పరీక్షించుకోవాలి.

### అపోహలు-వాస్తవాలు:

అపోహ: ఒకసారి డయాలసిస్ చేయించుకుంటే ఇక జీవితాంతం చేయించుకుంటూనే ఉండాలి.

**వాస్తవం:** ఇది శాశ్వతంగా కిడ్నీలు పాడయిన వారికి మాత్రమే వర్తిస్తుంది. తాత్కాలికంగా కిడ్నీలు పాడయిన వారు రెండు సార్లు డయాలసిస్ చేయించుకుని, ఆ స్థితికి కారణమయిన ఆరోగ్య సమస్యను సరిదిద్దుకుంటే, తిరిగి డయాలసిస్ అవసరం రాదు.

**అపోహ:** డయాలసిస్ వారానికి రెండుసార్లు చేయించుకుంటే సరిపోతుంది.

**వాస్తవం:** ఖర్చుకు వెనకాడి, వారానికి మూడు సార్లు చేయించుకోవలసిన డయాలసిస్ రెండు సార్లే చేయించుకోవడం సరి కాదు. ఇలా చేయడం వల్ల శరీరంలో వ్యర్థాలు పెరిగిపోతాయి.

**అపోహ:** దీర్ఘకాలం పాటు డయాలసిస్ చేయించుకుంటే బ్లడ్ గ్రూప్ మారిపోతుంది.

**వాస్తవం:** ఇది వట్టి అపోహ మాత్రమే! జన్యుపరంగా సంక్రమించిన బ్లడ్‌గ్రూప్ డయాలసిస్ వల్ల మారదు.

### ఖర్చు ఎంతంటే?:

హీమో డయాలసిస్, పెరిటోనియల్ డయాలసిస్%8ా% ఈ రెండింటికీ ఖర్చు ఇంచుమించు ఒకేలా ఉంటుంది. ఒక హీమో డయాలసిస్ కు 1500 నుంచి 2 వేల వరకూ ఖర్చు అవుతుంది. ఇంట్లో చేసుకునే పెరిటోనియల్ డయాలసిస్ కోసం వాడే ద్రవం ధర కూడా అంతే ఉంటుంది. ఏ డయాలసిస్ సెంటర్‌లోనైనా వైద్యులు మూడు సెషన్లలో డయాలసిస్ చేస్తారు. ఉదయం 8 నుంచి 12 వరకు, మధ్యాహ్నం 12 నుంచి 4, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు%8ా%ఈ సమయాల్లోనే రోగులు పేరు నమోదు చేయించుకోవాలి. ఆ సమయాల్లో మాత్రమే డయాలసిస్‌కు అవసరమైన వైద్యులు, టెక్నీషియన్లు అందుబాటులో ఉంటారు. ఒకవేళ ఎవరైనా రోగి అత్యవసరంగా ఆ సమయాల్లో కాకుండా అర్థరాత్రి వస్తే, వైద్యులతోపాటు, టెక్నీషియన్లు రావలసి ఉంటుంది. డయాలసిస్ కోసం ఉపయోగించే మిషన్లను సిద్ధం చేయవలసి ఉంటుంది. ఇందుకోసం అదనంగా ఖర్చు అవుతుంది కాబట్టి నియమిత వేళల్లో కాకుండా సమయం దాటిన తర్వాత వస్తే రోగికీ అదనపు ఖర్చు తప్పదు. ఇలా జరగకుండా ఉండాలంటే వైద్యులు సూచించిన విధంగా ముందుగానే పేర్లు నమోదు చేయించుకోవాలి.

### ఖమ్మం ఆదర్శం

ఖమ్మం జిల్లా ఆసుపత్రిలో ఉచిత డయాలసిస్ నిరుపేదల జీవితాల్లో మార్పు తెస్తుంది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డిసిడిసి ఆధ్వర్యంలో ఈ సేవలు ఆరోగ్య శ్రీ విభాగంలో కొనసాగుతున్నాయి. డయాలిసిస్ కి ఉపయోగించే డయలేజర్ మరియు టుబింగ్,ఫిస్టులా మరియు ప్రొటెక్టర్ తో పాటు ఇతర పరికరాలు అన్ని సింగిల్ యూజ్ చేయడం తో కిడ్నీ రోగులు ఇన్ఫెక్షన్ బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటున్నారు.మరియు నాణ్యమైన వైద్య సేవ జరుగుతుంది.ఖమ్మం జిల్లా ఆసుపత్రి డయాలసిస్ సెంటర్ మేనేజర్ ఆర్.క్రాంతి కుమార్, ఇంఛార్జి రవి కిడ్నీ బాధితులు రోగులు ఈ సేవలను ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా పొందాలని తెలిపారు.

ప్రతి నెల 1600 కి పైగా డయాలిసిస్ సేవలు జరుగుతున్నాయని, హెచ్.సి.వి,హెచ్.బి.సాగ్ వారికి కూడా ఇక్కడ డయాలిసిస్ అందుబాటులో ఉందని వారు తెలిపారు.

# రెండింతలు పెంచిన ప్రాపర్టీ టాక్స్ ను వెంటనే తగ్గించాలి

## - ఎన్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా

కుత్బుల్లాపూర్(ప్రశ్న న్యూస్) నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బిఆర్ఎస్ అధికారిక కౌన్సిల్ పాలనలో కార్పొరేషన్ ఏర్పాటు కాకముందు దాదాపు 38 వేల ఇండ్లకు ఉన్నపలంగా రెండింతలు ఇంటి పన్ను పెంచి 2022 సంవత్సరం నుండి వసూలు చేయడాన్ని కార్పొరేషన్ వెంటనే తగ్గించాలని, అదేవిధంగా గత రెండేళ్ల నుండి అదనంగా చెల్లిస్తున్న ఆస్తిపన్నును వచ్చే రెండేళ్లకు చెల్లించే విధంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నాయకులు నిజాంపేట్ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు మల్లారెడ్డి పాల్గొని మాట్లాడుతూ కార్పొరేషన్లో ప్రజల పన్నులు, బడ్జెట్ మొత్తం బిఆర్ఎస్ పాలకమండలి దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా రూ. 25 కోట్ల మిగులు బడ్జెట్ కార్పొరేషన్ ఐదు లక్షలకు తీసుకొచ్చి ఆగం పట్టించిన బిఆర్ఎస్ కౌన్సిల్, ప్రజాప్రతినిధులు, కమిషనర్పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిజాంపేట్ కార్పొరేషన్ ప్రజల దగ్గర నుంచి వసూలు చేసిన ప్రతి రూపాయిని జాగ్రత్తగా ప్రజావసరాలకే వినియోగించాలని, అదేవిధంగా టిఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ భూములు, చెరువులు, పార్కులు కబ్జాలే కాకుండా, ప్రజలు చెల్లించిన పన్ను సంపాదన కూడా దోచుకోవడంపై విచారణ జరపాలన్నారు. నిజాంపేట కార్పొరేషన్లో ఇంటి పన్ను రెండింతలు చేయడంపై తక్షణమే ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రజలపై హేతుబద్ధంగా పన్ను విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బీజేపీ ఎన్ఎంసీ అధ్యక్షులు ఆకుల సతీష్ మాట్లాడుతూ గత సంవత్సరం మార్చి 4వ తారీఖున నిజాంపేట కార్పొరేషన్ ఆఫీస్ ముందు రెండింతలు పెంచిన ప్రాపర్టీ టాక్స్ ను తగ్గించాలని, ఆధారం జిహెచ్ఎంసి మాదిరిగా రెంటల్ బేస్లో తీసుకోవాలి కానీ భూమి విలువ ద్వారా కాదని, తక్షణమే రెండింతలు పెరిగిన ప్రాపర్టీ టాక్స్ ను తగ్గిస్తామని హామీ ఇచ్చి సంవత్సరం గడిచిన సమస్యను పరిష్కరించని అసమర్ధ కమిషనర్ని వెంటనే మార్చాలన్నారు. తెలంగాణ మున్సిపల్ చట్టం 2019 ప్రకారం నూతన భవనాలు ప్రాపర్టీ అసెస్మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి మాత్రమే నూతన మున్సిపల్ చట్టం 2019 ప్రకారం అదనపు ఫైన్ విధించే విధానం అండర్ సెక్షన్ 82 టూ 105 స్పష్టంగా ఉన్నా నిజాంపేట కార్పొరేషన్లో ఇప్పటివరకు ఒకే ఆస్తిపన్ను విధానం లేకపోవడమే కాకుండా కార్పొరేషన్ ఏర్పడి మూడు సంవత్సరాలైనా శాస్త్రీయమైన ఆస్తి పన్ను12శాతం విధానం అక్టోబర్ 2023లో ఖరారు చేస్తూ కలెక్టర్ లేటరు రాయడం చూస్తే గత బిఆర్ఎస్ ప్రభుత్వం వైఫల్యంగా కనిపిస్తుందన్నారు. రెండుసార్లు ధర్నా చేసినా అప్పటి, ఇప్పటి కమిషనర్ బిఆర్ఎస్ పార్టీకే అనుకూలంగా పనిచేస్తూ పెంచిన ప్రాపర్టీ టాక్స్ ని కొనసాగించడం, ప్రజల దగ్గర నుంచి ముక్కుపిండి వసూలు చేసి బిఆర్ఎస్ కౌన్సిల్కి, మేయర్, ఎమ్మెల్యేకి తొత్తులాగా పనిచేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే నిజాంపేట కార్పొరేషన్లో రెండింతలు పెంచిన ప్రాపర్టీ టాక్స్, బడ్జెట్ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపి చర్యలు తీసుకొని రాష్ట్రంలో మిగతా మున్సిపాలిటీలో ఇలాంటి సమస్య రాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో మున్సిపల్ కార్యాలయం గేట్కు పలు డిమాండ్లతో కూడిన లేఖను బీజేపీ నాయకులు తగిలించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ రాష్ట్ర మైనార్టీ మోర్చా మహిళా ప్రముఖ అమలేశ్వరి, ఎస్సీ మోర్చా రాష్ట్ర జాయింట్ కన్వీనర్ దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి బిక్షపతి యాదవ్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, సెక్రటరీలు అరుణ్ రావు, శేషారావు, ప్రసాద్, అజయ్ కుమార్ రెడ్డి, నవ్య, కిసాన్ మోర్చా అధ్యక్షులు ప్రసాద్ రాజు, ఉపాధ్యక్షులు మాధవరావు, ప్రధాన కార్యదర్శి భూపాల్ రెడ్డి, ఓబీసీ మోర్చా అధ్యక్షులు మదన్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ముఖేష్ గౌడ్, ట్రేడర్ సెల్ కన్వీనర్ ఈశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు కవితా రెడ్డి, నవ్య, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు సైదులు, బీజవరం ఉపాధ్యక్షులు నరసింహారెడ్డి, కార్పొరేషన్ అధికారిక ప్రతినిధి కౌశిక్ నాయుడు, సోషల్ మీడియా కోకన్వీనర్స్ సురేష్, ఉదయ్, 31, 32 డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్, ఎల్లస్వామి, సచిన్, కార్పొరేషన్ కార్యవర్గ సభ్యులు నరేష్ గుప్తా, శివకుమార్, సతీష్ కృష్ణ, వరుణ్, నవీన్, రాజు, జగదీష్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశైల స్వామిఅమ్మవార్లకు ద్వారక తిరుమల దేవస్థానం తరుపున పట్టువస్త్రాలు సమర్పణ

**ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం అధికారులు**

**ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఆలయ ఈవో పెద్దిరాజు అధికారులు**



శ్రీశైలం ( ప్రశ్న న్యూస్) మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ వేంకటేశ్వరస్వామివారి దేవస్థానం, ద్వారకా తిరుమల వారు స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలను సమర్పించారు.ఆ దేవస్థానం తరుపున ఉపకార్యనిర్వహణాధికారి బాబురావు, ఉపప్రధానార్చకులు కొండూరి జనార్ధనాచార్యులు, పెద్దంటి ఫణికుమార్, సహాయకార్యనిర్వహణాధికారి పి. నటరాజరావు, వేదపండితులు మహేష్ కుమార్ శర్మ, సోమశేఖరశర్మ, రవికుమార్ శర్మ, శ్రీ వెంకటేశ్వరశర్మ ఈ పట్టువస్త్రాలను సమర్పించడం జరిగింది.అదేవిధంగా ఆ దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు శ్రీమతి అనసూయ, సుబ్బరావు, శ్రీమతి పద్మజ్యోతి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు కూడా ఈ పట్టువస్త్రాల సమర్పణలో పాల్గొన్నారు.కాగా ఈ సమర్పణ కార్యక్రమంలో ముందుగా ఆలయ రాజగోపురం వద్ద సంప్రదాయాన్ని అనుసరించి దేవస్థానం కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు, ద్వారకా తిరుమల దేవస్థానం అధికారులకు, అర్చకస్వాములకు స్వాగతం పలికారు.తరువాత ఆలయ రాజగోపురం వద్ద పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించబడ్డాయి. అనంతరం మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించబడ్డాయి.

# యూనిక్ కంపెనీ పేరుతో జనానికి కుచ్చుటోపీ

**3 కోట్లకు పైగా ఘరానా మోసం**

**బాధితుని ఇంటిని చుట్టుముట్టిన మహిళలు**

**ఘరానా మోసగాడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు**






ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) జనాన్ని నమ్మించి రూ. 3 కోట్లకు కుచ్చుటోపీ పెట్టిన బీఆర్ఎస్ పార్టీ యువ నేత దీకొండ సునీల్. బీఆర్ఎస్ పార్టీలో చురుగ్గా పాల్గొని గ్రామంలోని ప్రజలకు చేరువయ్యాడు. వివరాల్లోకి వెళితే వెంకటాపురం గ్రామానికి చెందిన దీకొండ సునీల్ (33) అనే వ్యక్తి యూనిక్ కంపెనీ పేరుతో సుమారు 4 వందల మందికి సుమారు మూడు కోట్ల రూపాయలు కుచ్చుటోపీ పెట్టినట్లు వెంకటాపురం గ్రామానికి చెందిన మహిళలు ఆరోపించారు. ఈ మేరకు మహిళలు సునీల్ ఇంటిని శనివారం ఉదయం చుట్టుముట్టి యూనిక్ కంపెనీ పేరుతో తమ వద్ద నెలనెలా వసూలు చేసిన తమ పొదుపు డబ్బులు తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి విచారించి సునీల్ ను పోలీస్ స్టేషన్ కు తరలించి విచారిస్తున్నారు. యూనిక్ కంపెనీ పేరుతో తమ వద్ద సునీల్ నెలనెలా డబ్బులు పొదుపుచేయమన్నాడని ఊరోడని, తెలిసినోడని, చేస్తే 46 నెలల తర్వాత యూనిక్ కంపెనీ తో డబుల్ ఇప్పిస్తామని చెప్పి 56 నెలలు గడుస్తున్నా ఇప్పటికీ తమ పొదుపు డబ్బులు ఇప్పించడం లేదని బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న యూనిక్ కంపెనీ బ్రాంచ్ కు వెళ్లి అడుగుతే సునీల్ తో తమ కంపెనీ కీ ఏలాంటి సంబంధం లేదని ఎవరికి డబ్బులు చెల్లించారో వారినే అడగాలని అంటున్నారని, బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి, అగ్రహారం, వెంకటాపురం ,హరిదాస్ నగర్, పదిర, ఎల్లారెడ్డిపేట మండలం లోని తదితర గ్రామాలకు చెందిన సుమారు 4 వందల మంది మహిళలు సునీల్ ఇంటికి వెళ్లి తమ డబ్బులు ఇప్పించాలని, అడుగుతే ఏమి సమాధానం చెప్పడం లేదని, తాము కూలీ నాలీ చేసుకొని కుటుంబాన్ని పోషించుకొని పొదుపు చేసుకున్నామని, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పొదుపు డబ్బులను సునీల్ తన స్వంతానికి వాడుకొని కంపెనీ తో మాట్లాడి ఇప్పిస్తానని భూకాయిస్తూ, కూలీ నాలీ చేసుకొని బతికే మా నిరుపేదల నోట్లో మట్టి కొట్టాలని చూస్తున్న సునీల్ నుంచి తమ పొదుపు డబ్బులను ఇప్పించాలని వారు జిల్లా పోలీస్ అధికారికి మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు. సునీల్ వద్ద తమ పొదుపు డబ్బులు ఇప్పించాలని మహిళలు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్ కు వచ్చి ఎస్ ఐ రామాకాంత్ ను కోరగా విచారణ జరిపి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు వెళ్ళిపోయారు.

## శ్రీశైలం క్షేత్రంలో రెండోవ రోజు ఘనంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

**భృంగి వాహనసేవ పై స్వామి అమ్మవార్ల దర్శనం**



శ్రీశైలం (ప్రశ్న న్యూస్) యాగశాల యందు శ్రీ చండీశ్వరస్వామికి ప్రత్యేక పూజాదికాలు జరిపించబడ్డాయి. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, పారాయణలు చేయబడ్డాయి. అనంతరం మండపారాధనలు, పంచావరణార్చనలు, జపానుష్ఠానాలు, నిత్యహవనాలు, రుద్రహోమం, చండీహోమం, కార్యక్రమాలు ఆగమ శాస్త్రం ప్రకారంగా జరిపించబడ్డాయి. అదే విధముగా ప్రదోష కాలపూజలు, జపానుష్ఠానాలు, రుద్రపారాయణలు, హోమాలు జరిపించబడుతాయి. భృంగి వాహనసేవ: ఈ బ్రహ్మోత్సవాలలో నిర్వహించబడే వాహనసేవలలో భాగంగా శ్రీ స్వామి అమ్మవార్లకు భృంగివాహనసేవ జరిపించబడుతుంది. ఈ సేవలో శ్రీ స్వామిఅమ్మవారి ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకార మండపంలో భృంగి వాహనంపై వేంచేబు చేయించి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించబడుతాయి. తరువాత శ్రీశైలక్షేత్ర ప్రధాన వీధులలో గ్రామోత్సవం జరుగనున్నది. నాదస్వరం, కోలాటం, చెక్కభజన, రాజభటులవేషాలు, కేరళ చండీమేళం, కొమ్ముకొయ్య నృత్యం, ముంబాయ్ డొల్ థాషా, మహిళా వీరగాసి కన్నడ జానపద కళా ప్రదర్శన, పురుషులు వీరగాసి కన్నడ కళా ప్రదర్శన, కాళికా నృత్యం, జాంజ్పథక, జానపద పగటి వేషాలు, గొరవనృత్యం, బుట్టబొమ్మలు, తప్పెటచిందు, బీరప్పడోలు, నందికోలసేవ, ఢమరుకం, చిడతలు, శంఖం, పిల్లనగ్రోవి, డోలు విన్యాసం తదితర కళారూపాలను గ్రామోత్సవంలో ఏర్పాటు చేయబడ్డాయి

# శ్రీపాదరావుకు ఘన నివాళి87వ జయంతి ఉత్సవాలు



ఏటూరునాగారం( ప్రశ్నన్యూస్) ఐటీడీఏ లోని కాన్ఫరెన్స్ హాల్లో మాజీ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ళ శ్రీపాదరావు 87వ జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిడి పోచం, ఏవో రఘు, ఎస్ఓ రాజ్ కుమార్,తో పాటు వివిధ శాఖల అధికారులు, హాజరై, శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిడి పోచం మాట్లాడుతూ శ్రీపాదరావు కాటారం మండలం ధన్వాడ సర్పంచ్ నుంచి అంచలంచెలుగా ఎదిగి ప్రజల గుండెల్లో నిలిచారని పేర్కొన్నారు. పలుమార్లు ఎమ్మెల్యేగా పనిచేసి మంథని నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని తెలిపారు. స్పీకర్ గా అత్యుత్తమంగా విధులు నిర్వర్తించి, ఆ పదవికే వన్నెతెచ్చారని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాజీవ్ గాంధీ అంతర్ రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్

**- మాజీ యం ఎల్ ఏ పొదెం వీరయ్య చేతుల మీదుగా ప్రారంభం**

**- పాల్గొంటున్న రాష్ట్ర స్థాయి జట్లు**

**- ముస్తాబైన జూనియర్ కళాశాల క్రీడా మైదానం**




భద్రాచలం(ప్రశ్న న్యూస్) భద్రాచలం జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నేటి నుండి రాజీవ్ గాంధీ మూడవ అంతరాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానున్నాయి. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య యువసేన ఆధ్వర్యంలో ఈ రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఈ టోర్నమెంట్ లో మొదటి బహుమతిగా 50,000/-, రెండో బహుమతిగా 25,000/-, మ్యాన్ ఆఫ్ ది సీరియస్ గా 5,000/- రూపాయలను ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతి మ్యాచ్ కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఇవ్వనున్నట్లు వారు తెలియజేశారు. ఈ టోర్నమెంట్ ను మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య లాంచనంగా ప్రారంభించనున్నారు. టెన్నిస్ బాల్ తో జరగనున్న ఈ మ్యాచ్ లో ప్రతి మ్యాచ్ నిర్ణీత 10 ఓవర్లు మాత్రమే జరుగునని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ వ్యవస్థాపకులు పొలమూరి బసవరాజ్, కాపుల శ్రీను, అలీం, మణి తదితర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# బకాయిలు చెల్లించకపోతే సరఫరా చేయలేం

## - ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన బకాయిలు చెల్లించకపోతే ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ఈఎస్ఐ ఆసుపత్రి కి సైతం మందులు, చికిత్సలకు వినియోగించే వైద్య పరికరాలను సరఫరా చేయలేమని ట్విన్ సిటీస్ హాస్పిటల్స్ సప్లయర్స్ అసోసియేషన్ స్పష్టం చేసింది. సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్ మాట్లాడారు. ప్రభుత్వం జారీచేసిన టెండర్ నోటిఫికేషన్ ద్వారా టెండర్లు పొంది గాంధీ, ఉస్మానియా నిమ్స్, నిల్లోఫర్ లతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, కార్మికుల కోసం నిర్వహిస్తున్న ఈఎస్ఐసి ఆసుపత్రులకు మందులు, రోగులకు అవసరమైన వైద్య పరికరాలను సరఫరా చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఆగస్టు నుంచి తమకు రావాల్సిన బకాయిలు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు పలుమార్లు విజ్ఞప్తి చేసిన ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు.

తీవ్రమైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగుల కు ఇబ్బందులు కలిగించే ఉద్దేశం తమకు లేకపోయినా ఆర్థిక వనరులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో సరఫరా చేయలేని దుస్థితి నెలకొంది అన్నారు. సమస్య జటిలం కాక ముందే ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాస్, గిరీష్ బట్, సాగర్ పాల్గొన్నారు.

# శ్రీవారి భక్తుల కోసం వేసవిలో విస్తృత ఏర్పాట్లు

**- శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ - డయల్ యువర్ ఈవోలో ఎవి.ధర్మారెడ్డి**





**తిరుమల :** వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టామని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో శనివారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో ముందుగా భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ఫిబ్రవరి 16న తిరుమలలో నిర్వహించిన రథసప్తమి ఉత్సవానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు భక్తులు సప్తవాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని తిలకించి తరించారు. లక్షలాది మంది భక్తులకు అన్నప్రసాదాలు, టి, కాఫీ, పాలు, అల్పాహారాలు అందించాం.

**తిరుమలలో వేసవి ఏర్పాట్లు :** వేసవి సెలవుల్లో తిరుమల శ్రీవారి దర్శనార్థం విశేషంగా విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టాం. ఏప్రిల్ నుండి జూలై వరకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందువల్ల సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ విఐపి బ్రేక్, శ్రీవాణి, టూరిజం కోటా, వర్చువల్ సేవలు, రూ.300 దర్శన టికెట్లు తగ్గించాం. తిరుమలలో దాదాపు 7500 గదులు ఉన్నాయి. వీటిలో 45 వేల మందికి సరిపడా వసతి అందుబాటులో ఉంది. దాదాపు 85 శాతం గదులు సామాన్య భక్తుల కోసమే కేటాయిస్తున్నాం. వేసవిలో తిరుమలకు తరలివచ్చే వేలాది మంది భక్తులకు అవసరమైనంత వసతి సౌకర్యం లేనందున భక్తులు తిరుపతిలో వసతి పొందాల్సిందిగా కోరడమైనది.శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం వద్ద ఉన్న పాత మ్యూజియంలో ఫిబ్రవరి 29వ తేదీ నుండి భక్తులకు నిత్యాన్నదానాన్ని ప్రారంభించాం. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం :శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం(చిన్నపిల్లల గుండె ఆసుపత్రి) ప్రారంభమైన రెండేళ్ల కాలంలోనే 12 గుండె మార్పిడి ఆపరేషన్లు, 2485 గుండె ఆపరేషన్లు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యబృందాన్ని అభినందిస్తున్నాను.

**శ్రీ పద్మావతి జనరల్ ఆసుపత్రి :** స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీ పద్మావతి జనరల్ ఆసుపత్రిలో మార్చి 1వ తేదీ నుండి గైనకాలజీ, ఒబెస్ట్రిక్స్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, ఇఎన్‌టి, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ విభాగాలలో నగదు రహిత వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది.

**తిరుమలలో ఉత్సవాలు :** మార్చి 20 నుండి 24వ తేదీ వరకు శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు వైభవంగా జరుగనున్నాయి. రాత్రి 7 నుండి 8 గంటల వరకు పుష్కరిణిలో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు. మార్చి 8న గోగర్భ తీర్థంలో క్షేత్రపాలకుడికి మహాశివరాత్రి పర్వదినం. మార్చి 25న తుంబురుతీర్థ ముక్కోటి.

**ఫాల్గుణ మాస కార్యక్రమాలు :** ఎస్వీ వేదవిశ్వవిద్యాలయంలో మార్చి 20న అమలక ఏకాదశి, మార్చి 25న లక్ష్మీ జయంతి, ఏప్రిల్ 2న శీతలాష్టమి పూజ నిర్వహిస్తాం. వీటిని ఎస్వీబీసీలో ప్రసారం చేస్తాం.

**టీటీడీ ఆలయాల్లో బ్రహ్మోత్సవాలు :**మార్చి 8వ తేదీ వరకు శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో.

మార్చి 1 నుండి 10వ తేదీ వరకు - తిరుపతిలోని శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో. మార్చి 8 నుండి 16వ తేదీ వరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్ శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో. మార్చి 9 నుండి 17వ తేదీ వరకు తొండమాన్‌పురంలోని శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో. మార్చి 16 నుండి 24వ తేదీ వరకు తరిగొండలోని శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో.ఫిబ్రవరి నెలలో నమోదైన వివరాలు

**దర్శనం :** శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య - 19.06 లక్షలు.

**హుండీ :** హుండీ కానుకలు - రూ.111.71 కోట్లు.

**లడ్డూలు :** విక్రయించిన శ్రీవారి లడ్డూల సంఖ్య - 95.43 లక్షలు.

**అన్నప్రసాదం :** అన్నప్రసాదం స్వీకరించిన భక్తుల సంఖ్య - 43.61 లక్షలు.

**కల్యాణకట్ట :** తలనీలాలు సమర్పించిన భక్తుల సంఖ్య - 6.56 లక్షలు.

# రీసర్వే మూడవ విడత, ఎంఎస్ఎమ్ఈ సర్వే

**- తదితర అంశాలపై అధికారులు ప్రణాళికా బద్ధంగా నిర్దేశిత గడువులోపు పురోగతి సాధించాలి**

**- జిల్లాలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డులు శత శాతం పంపిణీ జరగాలి - జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీ శ**



**తిరుపతి** మూడవ విడత రీ సర్వే, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం అమలు, త్రాగు నీటి ఎద్దడి రాకుండా తీసుకుంటున్న చర్యలు తదితర సంబంధిత అంశాలపై ప్రణాళికా బద్ధంగా పని చేసి నిర్దేశిత గడువులోపు పురోగతి సాధించాలి అని, ఆరోగ్యశ్రీ కార్డులు శత శాతం పంపిణీ జరగాలని, జిల్లాలో పల్స్ పోలియో చుక్కలు వేసే కార్యక్రమం విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీ శ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం సిఎస్ క్యాంపు కార్యాలయం విజయవాడ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి వర్చువల్ విధానంలో ఫేజ్ -3 రీ సర్వే, ఇనామ్ మరియు ఫ్రీ హోల్డ్ ఆఫ్ అసైన్డ్ భూములు, పేదలందరికీ ఇళ్ళు ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్, పంచాయితీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖపై కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకం అమలు, వేసవిలో త్రాగునీటి కొరత లేకుండా తీసుకుంటున్న చర్యలు, వైద్య ఆరోగ్య శాఖ మరియు కుటుంబం సంక్షేమనీ కు సంబంధించి జగనన్న ఆరోగ్య సురక్ష, సంతృప్త స్థాయిలో అర్హులైన అందరికీ ఆరోగ్యశ్రీ కార్డుల డిస్ట్రిబ్యూషన్, పరిశ్రమలకు భూ కేటాయింపు పెండింగ్ అంశాలు, ఎంఎస్ఎంఈ క్లస్టర్ ఏర్పాటు పురోగతి, ధాన్యం సేకరణ, పల్స్ పోలియో అంశాలపై కలెక్టర్ల స్పందన వంటి పలు అంశాలపై సంబంధిత కార్యదర్శులతో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించి దిశా నిర్దేశం చేయగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ గారు సంబంధిత జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించి మాట్లాడుతూ మూడవ దశ రీ సర్వే, ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్, కరువు మండలాల్లో ఉపాధి హామీ పనులు షెల్ఫ్ ఆఫ్ వర్క్స్ సరిపడా గుర్తించాలని, త్రాగు నీటి ఎద్దడి వచ్చే కరువు మండలాలను గుర్తించి వాటిలో నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రణాళికా బద్ధంగా పని చేసి నిర్దేశిత గడువులోపు పురోగతి సాధించాలి అని, ఎలాంటి అలసత్వం ఉండరాదని అన్నారు. ఎంఎస్ఎమ్ఈ సర్వే, ఉద్యమ్ రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని సూచించారు. రోజువారీ ధాన్యం ధరలు సిఎం యాప్ లో అప్డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. క్యాన్సర్ సర్వే ఎంపిడిఓ యంత్రాంగం వాలంటీర్లు రెండు గృహ సందర్శనలు చేసేలా వేగవంతం చేయాలనీ, ఎఎన్ఎం గృహ సందర్శన చేసి టెస్టింగ్ లు షెడ్యూల్ మేరకు జరిపేలా చూడాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కార్డులు శతశాతం పంపిణీ చేసి ఈ కెవైసి అప్డేట్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆరోగ్యశ్రీ యాప్ ప్రతి కుటుంబం డౌన్లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుని అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. రేపు నేషనల్ ఇమ్మ్యునైజేషన్ డే జిల్లాలో పల్స్ పోలియో విజయవంతానికి కృషి చేయాలని, అన్ని వర్గాల వారు ఇందుకు సహకరించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో అన్ని రకాల చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, పథక సంచాలకులు డ్వామా శ్రీనివాస ప్రసాద్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రతాప్ రెడ్డి, జిల్లా సర్వే అధికారి జయరాజ్, జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారి విజయ్ కుమార్, జిల్లా పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకర నారాయణ, డిఎంహెచ్ఓ శ్రీహరి, జిల్లా ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త రాజశేఖర్ రెడ్డ తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# కానిస్టేబుల్ ప్రాణం తీసిన రోడ్డు గుంత

**శ్రీకాకుళం** శ్రీకాకుళం జిల్లా పాలకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక కానిస్టేబుల్ మృతి చెందాడు. కానిస్టేబుల్ సురేశ్ పాలకొండ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం పాలకొండకు వెళ్తుండగా గుంతను తప్పించబోయి అదుపుతప్పి బైక్ మీద నుంచి కిందపడ్డాడు. దాంతో అతడి తలకు తీవ్రంగా గాయమైంది. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

# పిడుగురాళ్లలో వరుస దొంగతనాలు

**పల్నాడు** పిడుగురాళ్ల పట్నంలో పలుచోట్ల జరుగుతున్న దొంగతనాలతో ఆయా షాపులో వారు బెంబేలెత్తుతూ ఆందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని ఆంధ్ర బ్యాంక్ ఎదుర వీధిలో కొత్త ద్విచక్ర వాహనం బజాజ్ పల్సర్ వాహనాన్ని కొందరు గుర్తుతెలియని యువకులు అపహరించారు.

ఇదే రోజు మంగళవారం తెల్లవారుజామున ఆంధ్ర బ్యాంక్ ఎదురు పబ్లిక్ టాయిలెట్స్ ఎనుక బిల్డింగ్ పై నిర్వహిస్తున్న హనీ ప్లాస్టిక్ షాపులో షాప్ యజమాని సుభాని రోజులాగే సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో షాపుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి బుధవారం ఉదయం 9 గంటల తర్వాత షాపు వద్దకు వచ్చి చూడగా షట్టర్ కొన్న తాళాలు పగలగొట్టి ఉన్నాయి

షట్టర్ తీసి షాపులోకి వెళ్ళగా కౌంటర్లో ఉన్న కొంత నగదు ఒక గుర్తు తెలియని యువకుడు అపహరించినట్లు తెలుసుకున్న సుభాని సిసి ఫుటేజ్ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్నారు... అలాగే ఇటీవల కాలంలో మరికొన్ని షాపుల్లో కూడా ఇలాగే దోపిడీలు జరిగినట్లు ఆయా షాపులు వారు ఆరోపిస్తున్నారు దీనికి సంబంధించి సిసి ఫుట్ పేజీ కూడా వారు పంపడం జరిగింది. పోలీసులు నిఘా ఉంచి నిందితులను అదుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు..

# చిత్తూరులో చావో, రేవో

**తిరుపతి :** చిత్తూరు జిల్లాలో సీట్ల పంచాయతీ టిడిపి హై కమాండ్?కు సవాలుగా మారింది. అధినేత సొంత జిల్లా చిత్తూరులో 14 అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటికే ప్రకటించిన స్థానాలతో పాటు భవిష్యత్తులో ప్రకటించబోయే నియోజకవర్గాల్లోనూ గందరగోళం నెలకొంది. ఇంకా 7 అసెంబ్లీ సెగ్మెంట్‌లతోపాటు 2 పార్లమెంట్ సీట్లను ప్రకటించాల్సిన టిడిపి హై కమాండ్ పొత్తుల అంశంతో కుస్తీలు పడుతోంది. ఇప్పటికే టిడిపి అధినేత చంద్రబాబు పోటీ చేయబోయే కుప్పంతో పాటు పలమనేరు, చిత్తూరు, గంగాధర నెల్లూరు, నగరి, తంబళ్లపల్లి, పీలేరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించారు. చంద్రబాబు మిగతా చోట్ల ఎవరిని బరిలో దింపాలన్న దానిపై మేధోమధనం చేస్తున్నారు. తిరుపతితోపాటు శ్రీకాళహస్తి, సత్యవేడు, చంద్రగిరి, పూతలపట్టు, మదనపల్లి, పుంగనూరు అసెంబ్లీ స్థానాలే కాకుండా.. తిరుపతి, చిత్తూరు పార్లమెంటు స్థానాలకు బరిలో దింపే అభ్యర్థులు ఎవరన్న దానిపై క్లారిటీ ఇవ్వలేక పోతున్నారు. దీంతో పార్టీ ఇన్‌చార్జ్‌లు, ఆశావాహుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికే ప్రకటించిన నగిరిలో టిడిపి ఇన్‌చార్జ్ గాలి భాను ప్రకాష్?కు వ్యతిరేకంగా పార్టీ నేతలు కొందరు అసమతి రాగం వినిపిస్తున్నారు.ఇక చిత్తూరులోనూ ఇదే పరిస్తితి ఉంది. చిత్తూరు టిడిపి అభ్యర్థిగా గురజాల జగన్మోహన్?ను ప్రకటించిన హై కమాండ్ నిర్ణయం బలిజ సామాజికవర్గాల్లో అసంతృప్తికి కారణమైంది.ఈ సామాజిక వర్గానికి చెందిన వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులుకు ఆ పార్టీ చెక్ పెడితే, బలిజ సామాజిక వర్గం ప్రభావితం చూపే చిత్తూరులో టిడిపి కూడా ఛాన్స్ ఇవ్వకపోవడంతో ఆ సామాజిక వర్గం రోడ్డు ఎక్కింది. ఇక శ్రీకాళహస్తిలో బొజ్జల సుధీర్‌కే టికెట్ అన్న ప్రచారం ఎన్నో రోజులుగా ఉంది. శ్రీకాళహస్తి టిడిపి ఇన్‌చార్జ్‌గా బొజ్జల సుధీర్ ఇప్పటికే జనంలో తిరుగుతూ ఎన్నికల ప్రచారాన్ని చేపట్టగా.. తొలి జాబితాలో ఆయన పేరు లేకపోవడంతో అయోమయం నెలకొంది. దీంతో ఆశావాహులు కొందరు తమకే ఛాన్స్ అన్న ప్రచారాన్ని తెర మీదికి తెస్తున్నారు. ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. శ్రీకాళహస్తి టికెట్‌పై ఆశలు పెట్టుకున్న మాజీ ఎమ్మెల్యే SnV నాయుడు ఉండవల్లిలో ప్రయత్నిస్తుంటే, మరోవైపు పొత్తులో భాగంగా జనసేన, బిజెపిలు హడావిడి చేస్తున్నాయి.ఒక అడుగు ముందుకేసిన జనసేన ఇన్‌చార్జ్ వినూత పార్టీ అభ్యర్థిగా శ్రీకాళహస్తి నుంచి బరిలో ఉంటానని ఏకంగా ప్రచారం చేపట్టింది. మరోవైపు బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ బిజెపి టికెట్ కోసం తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారు. శ్రీకాళహస్తిలోనే కాదు సత్యవేడులోనూ ఇలాంటి పరిస్థితి నెలకొంది. సిట్టింగ్ ఎమ్మెల్యే ఆదిమూలం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీ హై కమాండ్ టచ్?లోకి వెళ్లడంతో ఇప్పటికే పార్టీ ఇన్‌చార్జ్‌గా ఉన్న హెలెన్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

# ఏపీలో బీజేపీ ఒంటరి పోరా..

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న వేళ రాజకీయాలు రసకందాయంలో పడుతున్నాయి. ఏపీ ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసే ఆలోచన చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ శివార్లలో పార్టీ కీలక నేతలు సమావేశమై ఇందుకు సంబంధించి చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చిన కొంత మంది నేతలు.. ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి సహా ఏపీకి చెందిన పలువురు నేతలను కలిసి ఈ అంశంపై చర్చించినట్లు సమాచారం. ఏపీలో బీజేపీ-టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తాయని భావిస్తుండగా.. తాజా పరిణామం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.టీడీపీ-జనసేన కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జాబితా విడుదల చేయడమే కాకుండా, ఉమ్మడిగా బహిరంగ సభలు కూడా నిర్వహిస్తున్నారు. మరోవైపు.. బీజేపీ కూడా తమతో కలిసి పనిచేస్తుందని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కొంత కాలంగా దీమాగా చెబుతూ వస్తున్నారు. అంతేకాదు, టీడీపీతో కలిసి పనిచేసేందుకు ఢిల్లీ పెద్దలను ఒప్పించడానికి తాను తిట్లు కూడా తినాల్సి వచ్చిందంటూ పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు.ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో బీజేపీ ఒంటరిగా పోటీ చేయాలని భావించడం అటు జనసేనకు, ఇటు టీడీపీకి పెద్ద దెబ్బే అవుతుంది. అంతేకాదు.. టీడీపీ, జనసేన నుంచి వచ్చే నేతలను, టికెట్లు రాని వారిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఏపీలో 175 అసెంబ్లీ స్థానాలకు 25 ఎంపీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర నాయకత్వానికి బీజేపీ అధిష్టానం సూచించినట్లు తెలుస్తోంది.ఇప్పటికే బీజేపీ పెద్దలతో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పొత్తుల అంశంపై పలుమార్లు చర్చించారు. ఈ చర్చలు ఓ కొలిక్కి రాకముందే జనసేన-టీడీపీ కలిసి 99 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం బీజేపీ అధిష్టానానికి ఆగ్రహం తెప్పించిందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.బీజేపీ జాతీయ నేత శివప్రకాశ్‌జీ నేతృత్వంలో హైదరాబాద్ నగర శివార్లలో సమావేశం ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ భేటీకి ఏపీ నుంచి 10 మంది ముఖ్య నేతలను మాత్రమే ఆహ్వానించినట్లు తెలుస్తోంది. ఏపీ ఎన్నికలకు సంబంధించి పొత్తులు సహా వివిధ ప్రత్యామ్నాయాలపై సమాలోచనలు జరుపుతున్నట్లు సమాచారం. పొత్తులే కాకుండా, సొంతంగా బలపడేందుకు వ్యూహాలను రచించాలని పార్టీ నేతలకు శివప్రకాశ్‌జీ సూచించినట్లు తెలుస్తోంది.పొత్తుకు బీజేపీ ఆశీస్సులు ఉన్నాయని పవన్ కళ్యాణ్ చెబుతూ వస్తున్నారు. ఒకవేళ బీజేపీ ఒంటరిగా పోటీ చేయాలని నిర్ణయం తీసుకుంటే.. టీడీపీ-జనసేన కూటమి పరిస్థితి ఏమిటి? పవన్ కళ్యాణ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? బీజేపీ విడిగా పోటీ చేస్తే, అది ఎవరికి నష్టం? అనేవి చర్చనీయాంశాలుగా మారాయి. తెలుగు రాష్ట్రాల్లో ఏప్రిల్ మొదటి వారంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పొత్తుల అంశంపై బీజేపీ త్వరలోనే ప్రకటన చేసే అవకాశం ఉంది.

# గంజాయి చాటున మిరప

**అనంతపురం :** మిరప చేను మాటున గంజాయి సాగు చేస్తున్నాడు రైతు. పక్కా ప్లాన్‌తో నిర్వహించిన ఆపరేషన్‌లో అసలు యవ్వారం వెలుగులోకి వచ్చింది.వ్యవసాయంలో నష్టాలు వచ్చేటప్పుడు ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్పిన మాటలు ఓ రైతుకు వేరేలా అర్థమైంది. ఇక వ్యవసాయం దండగ అనుకున్నాడో.. ఏమో..! గంజాయి సాగు చేస్తూ పండగ చేసుకుంటున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా గుడిబండ మండలం మందలపల్లి గ్రామంలో హనుమంతరాయప్ప అనే రైతు మిరప తోటలో గంజాయి సాగు మొదలుపెట్టాడు. హనుమంతరాయప్ప తన పొలంలో వక్క, మిరప తోట ముసుగులో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. గుట్టుచప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్న హనుమంతురాయప్ప బండారాన్ని తోటి రైతులే బయటపెట్టారు.రోజూ మిరప చేనుకు వెళ్లి గంజాయి మొక్కలకు నీళు పెడుతున్న హనుమంతరాయప్ప వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన చుట్టుపక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు? పక్కా సమాచారంతో సెబ్ అధికారులు హనుమంత రాయప్ప గంజాయి సాగు చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మిరప తోట మధ్యలో ఎవరికీ అనుమానం రాకుండా 13 గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు అధికారులు గుర్తించారు. రైతు హనుమంతరాయప్ప చేత 13 గంజాయి మొక్కలను పీకించి, అతనిపై కేసు నమోదు చేశారు సెబ్ అధికారులు. పత్తి, మిరప చేలలో అంతర్ పంటగా కందులు, మినుములు వేయడం చూశా. కానీ మిరప తోటలో అంతర్ పంటగా గంజాయి సాగడాన్ని ఇదేందయ్యా ఇది.. మేము ఎక్కడా చూడలేదు అంటున్నారు తోటి రైతులు. నిందితుడిని అరెస్ట్ చేసిన సెబ్ అధికారులు రిమాండ్‌కు తరలించారు.

# 6నుంచి ప్రజల్లోకి సీబీఎన్

**విజయవాడ :** తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా చంద్రబాబు నాయుడు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఆరు పదుల వయసులోనూ విశ్రాంతి ఎరుగక పార్టీ కేడర్ ను ఎన్నికలకు సమాయత్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 25 పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో రా కదలిరా పేరుతో సభలు నిర్వహిస్తున్న చంద్రబాబు.. ఈనెల ఆరో తేదీ నుంచి మరో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. ప్రజాగలం పేరుతో మళ్లీ ప్రజల్లోకి వెళ్లేందుకు ఆయన సిద్ధపడుతున్నారు. మార్చి ఆరో తేదీన ప్రారంభం కానున్న ఈ సభలు వరుసగా ఐదు రోజులుపాటు ఐదు ప్రాంతాల్లో భారీ ఎత్తున నిర్వహించేందుకు పార్టీ ఏర్పాటు చేస్తోంది. ప్రజాగలం పేరుతో చంద్రబాబు నాయుడు నిర్వహించనున్న ఈ సభల్లో ప్రజా సమస్యలను ఎలుగెత్తి చాటడంతోపాటు ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. అందులో భాగంగానే ఐదు రోజులపాటు భారీ ఎత్తున ప్రజాగలం కార్యక్రమాన్ని అనేక ప్రాంతాల్లో నిర్వహించనున్నారు. ప్రజాగలం కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు వైసిపి బలంగా ఉన్న స్థానాల్లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వైసీపీకి బలమైన స్థానాలను లక్ష్యంగా చేసుకొని ఈ సభలను ఏర్పాటు చేయడం ద్వారా అక్కడ ఉన్న తెలుగుదేశం పార్టీ కేడర్ ను ఉత్తేజితం చేయడమే లక్ష్యంగా చంద్రబాబు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ, జనసేన కూటమి ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెంలో నిర్వహించిన సభ విజయవంతమైందని ఇరు పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు మరో వినూత్న కార్యక్రమం చేపట్టి ప్రజల్లోకి వెళ్లడం ద్వారా కూటమికి వస్తున్న ప్రజాధరనను కొనసాగించే ఉద్దేశంలో ఆయన ఉన్నట్లు చెబుతున్నారు. ఈ సభల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కూడా పాలుపంచుకునేలా చంద్రబాబు వ్యూహరచన చేస్తున్నారు. బిజెపి కూడా కూటమిలో చేరితే ప్రజాగళం సభల్లో బిజెపి నాయకులు కూడా పాల్గొననున్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నిర్వహిస్తున్న రా కదలిరా సభలు ఈ నెల నాలుగో తేదీతో రాప్తాడులో ముగియనున్నాయి. ఒక్కరోజు విరామం తీసుకుని ఆరో తేదీ నుంచి ప్రజాగళం కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. ఐదు రోజులపాటు ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రజాగళం పేరుతో చంద్రబాబు నిర్వహిస్తున్న కార్యక్రమం కర్నూలు జిల్లా నంద్యాలలో తొలిరోజు ఏర్పాటు చేయబోతున్నారు. ఉదయం కర్నూలులో పూర్తయిన వెంటనే మధ్యాహ్నం మైదుకూరులో మరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు భారీ ఎత్తున ప్రజలు వచ్చేలా తగిన ఏర్పాట్లు చేయాల్సిందిగా పార్టీ కేడర్ కు ముఖ్య నాయకుల నుంచి సమాచారాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే 25 పార్లమెంటు స్థానాల పరిధిలో నిర్వహించిన రా కదలిరా సభలు విజయవంతం కావడంతో.. ప్రజా గళం కార్యక్రమాన్ని కూడా అంతే స్థాయిలో విజయవంతం చేయడంపై పార్టీ నాయకులు దృష్టి సారించారు. ఇప్పటికే పలు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో ఆయా అభ్యర్థులు భారీ ఎత్తున జనాలను సమీకరించేలా పార్టీ అధినాయకత్వం వారికి ఆదేశాలను జారీ చేసింది. ప్రజాగళం సభల తరువాత ఆయా ప్రాంతాల్లో పార్టీ మైలేజీ ఒక్కసారి పెరిగేలా వ్యూహరచన చేస్తున్నారు. ప్రతి సభల్లోను అక్కడ నెలకొన్న సమస్యలను ఎలుగెత్తి చాటడంతోపాటు తాము అధికారంలోకి వస్తే వాటిని ఎలా పరిష్కరిస్తామన్న విషయాలను కూడా చంద్రబాబు వివరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి

# వాచ్ మెన్‌కు 3 ప్రభుత్వ ఉద్యోగాలు

**హైదరాబాద్ :** పట్టుదలతో ప్రయత్నిస్తే... ఏదైనా మన సొంతం అవుతుందని నిరూపించాడు మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రవీణ్ అనే యువకుడు. నైట్ వాచ్ మెన్ గా పని చేస్తూనే... ఏకంగా మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సంపాదించాడు. తాజా వెల్లడించిన గురుకుల ఫలితాల్లో టీజీటీ, పీజీటీతో పాటు జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి కూడా ఎంపికయ్యాడు. ఇప్పుడు ప్రవీణ్ ప్రస్థానం... సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. ప్రవీణ్ కు నెటిజన్లు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. సూపర్ బ్రదర్ అంటూ పోస్టులు చూస్తున్నారు.ప్రవీణ్ ది మంచిర్యాల జిల్లా జన్నారం మండలం పొన్కల్ గ్రామం. ఓయూ క్యాంపస్ లో ఎంకాం, బీఈడీ, ఎంఈడీ పూర్తి చేశాడు. ప్రవీణ్ తల్లిదండ్రులు స్వగ్రామంలో పని చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తండ్రి మేస్త్రీ పని చేస్తుండగా... తల్లి బీడీ కార్మికులు. వారికి భారంగా కావొద్దని భావించిన ప్రవీణ్... ఓయూ క్యాంపస్ లో ఉన్న ఈఎంఆర్ సీలో నైట్ వాచ్ మెన్ గా చేరాడు. గత ఐదేళ్లుగా అక్కడ పని చేస్తూనే.... ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నాడు.

తన ఖర్చులు తల్లిదండ్రులకు భారం కావొద్దని భావించిన ప్రవీణ్... నైట్ వాచ్ మెన్ గా చేరాడు.ఇక ప్రవీణ్ ఎలాంటి కోచింగ్ లేకుండానే సొంతంగానే ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యాడు. యూట్యూబ్ లోని కంటెంట్ ను సేకరిస్తూ తన సాధనకు మరింత పదును పెట్టాడు. 2018లో డీఎస్సీ పరీక్ష రాసిన ప్రవీణ్,,, కేవలం అర మార్కుతో ఉద్యోగాన్ని కోల్పోయాడు. ఆ తర్వాత గ్రూప్ 2 కోసం కూడా చదివాడు. అయితే గురుకుల ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన ప్రవీణ్... ఏకంగా మూడు ఉద్యోగాలకు ఎంపికై తనకు తానే సాటి అని చాటిచెప్పాడు.ప్రవీణ్ మూడు ఉద్యోగాలకు ఎంపిక అవ్వటం పట్ల అతను వాచ్ మెన్ గా పని చేసిన ఇఒఖీఅ ప్రాంగణం డైరెక్టర్ పి రఘుపతి హర్షం వ్యక్తం చేశారు. అక్కడ పని చేస్తున్న ఇతర సిబ్బంది కూడా ప్రవీణ్ కు అభినందనలు తెలిపారు.

ప్రజాప్రశ్న



## బీఆర్ఎస్, కాంగ్రెస్ కన్నా
# బీజేపీ టిక్కెట్లకే ఫుల్ డిమాండ్

### సీనియర్ నేతలకు చాన్స్

తెలంగాణలో బీజేపీకి నాలుగు ఎంపీ సిట్టింగ్ స్థానాలున్నాయి. వీటిలో సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధినేత జి కిషన్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసిందని ఆ పార్టీ వర్గాల సమాచారం. దీంతోపాటు కరీంనగర్ ఎంపీ సీటును బీజేపీ మాజీ అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కు, నిజామాబాద్ పార్లమెంటు సీటును ప్రస్థుత సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అర్వింద్ కు ఖరారు చేశారు. మరో సిట్టింగ్ అయిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు అభ్యర్థిత్వాన్ని మాత్రం బీజేపీ పెండింగులో పెట్టింది. చేవేళ్ల సీటును గతంలో కాంగ్రెస్ నుంచి వచ్చిన మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఖమ్మం నుంచి డాక్టర్ వెంకటేశ్వరరావు, భువనగిరి సీటును మాజీ బీఆర్ఎస్ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ కు ఖరారు చేసిందని బీజేపీ నేతలు చెబుతున్నారు. మహబూబ్ నగర్, మల్కాజిగిరి వంటి చోట్ల టిక్కెట్ కోసం గట్టి పోటీ నెలకొంది.

### భారీగా సీట్లు గెల్చుకుంటామన్న నమ్మకం

తెలంగాణలో బీజేపీకి నాలుగు సిట్టింగ్ స్థానాలుండగా, ఈ సారి ఎన్నికల్లో వీటి సంఖ్యను రెట్టింపు చేసుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. తెలంగాణలోని 12 ఎంపీ సీట్లపై గురి పెట్టిన కమలనాథులు దీనికి అనుగుణంగా బలమైన అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దించాలని నిర్ణయించారు. దీనికోసం ఇతర పార్టీల నుంచి నేతలను పార్టీలోకి తీసుకునేందుకు బీజేపీ నేతలు వ్యూహాలు రూపొందించారు. రామమందిర నిర్మాణం, పదేళ్ల అభివృద్ధి పనులతో మోదీ పట్ల ఓటర్లలో ఆదరణ పెరిగిన నేపథ్యంలో కనీసం 8 స్థానాలనైనా సాధించాలని బీజేపీ నేతలు కృతనిశ్చయంతో ఉన్నారు. దీనిలో భాగంగా పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ సత్తాను చూపించేందుకు నేతలు పట్టుదలగా దీటైన వ్యూహాలతో ముందుకు పోతున్నారు. ప్రస్తుత వాతావరణం తమకు అనుకూలంగా ఉందని గట్టిగా నమ్ముతున్నారు.

## కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో
# ఈసారి ఐదు గ్యారంటీలు

కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో కమిటీ ముసాయిదాను ఖరారు చేయనుంది. ఆ తర్వాత ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే చేసి వచ్చే నెలాఖరులో దీన్ని విడుదల చేసే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రాష్ట్రాల్లో గ్యారంటీల హామీలతో విజయాలు సాధిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు జాతీయ స్థాయిలోనూ ఐదు గ్యారంటీల్ని ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఉత్తరాదిన జరిగిన మూడు రాష్ట్రాల ఎన్నికల్లో గ్యారంటీలు పని చేయకపోవడంతో దీనికి విరుగుడుగా ఏం చేస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

# వైఎస్ఆర్సీపీలో జాబితాల గందరగోళం

అధినేత సీఎం జగన్ ఎనిమిది జాబితాలను రిలీజ్ చేశారు. వారే అభ్యర్థులు అన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. కానీ సీఎం జగన్ రిలీజ్ చేస్తోంది అభ్యర్థుల జాబితా కాదు కేవలం సమన్వయకర్తల జాబితా మాత్రమే. విడుదల చేస్తున్న జాబితాలన్నీ పూర్తిగా మార్పు, చేర్పులకు సంబంధించినవే. జాబితాలో చోటు లేని వారు ఇప్పటికైతే సేఫ్‌గా ఉంటున్నారు. మందు ముందు కసరత్తులో వారి పేర్లు ఉంటాయా ఉండవా అన్నది స్పష్టత రావాల్సి ఉంది. అయితే మార్పు చేర్పుల్లో సీట్లు కోల్పోయిన వారు సీట్ల మార్పిడికి గురైన వారిలో అసంతృప్త వాదులు ఇవి సమన్వయకర్తల నియామకం మాత్రమే అని అభ్యర్థులు కాదని తేల్చి చెబుతున్నారు. రెండు నెలల్లో ఏమైనా జరగొచ్చినా బీఫాం మాకే తప్పక వస్తుందని వారు దీమాగా ఉన్నారు. టిక్కెట్లు దక్కని ఎమ్మెల్యేలు కొంత సైలెంట్ గా ఉంటున్నారు కానీ తమకు చాన్స్ రాదని అనుకోవడం లేదు. ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లోనే పాతుకుపోయి ఉంటారు. కొత్త నియోజకవర్గానికి వెళ్లాలంటే చాలా మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలి. అక్కడ ఉండే క్యాడర్ ను తమ దారిలో నడిపించుకోవాలంటే వారి ఆశల్ని అంచనాల్ని అందుకోవాల్సి ఉంటుంది. అదేమంత చిన్న విషయం కాదు. వైఎస్ఆర్సీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వం తమ పార్టీ అధికారంలోకి వచ్చినా పెద్దగా ఏమీ ఒరగలేదన్న అభిప్రాయంలో ఉన్నారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో ఎంతోకొంత వెనుకేసుకోవాలన్న ఆలోచనలో ఉన్నారు. ఇది కొత్త ఇంచార్జులక అవగతమవతోంది. అదే సమయంలో తమ నియోజకవర్గంలో పెంచుకున్న పట్టు, క్యాడర్ ను కొత్త నేతకు ధారదత్తం చేయడానికి సిద్ధంగా ఉండరు. అందుకే నియోజకవర్గం నుంచి వెళ్లేదమీ ఉండదని ఇంకా సమయం ఉన్నందున కంగారు పడాల్సిందేమీ లేదని అంటున్నారు. తాము ఉన్న నియోజకవర్గం నుంచే పోటీ చేస్తామని చెబుతున్నారు. తాము సహకరించకపోతే పార్టీ గెలవదన్న విషయాన్ని హైకమాండ్ కు బలంగా చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

### ఎంపీ అభ్యర్థులంతా వెనుకడుగు

వైసీపీలో ఎంపీ అభ్యర్థుల ఖరారు చూస్తే ఇంత బలహీనంగా ఉన్నారేంటి అని రాజకీయవర్గాలకు అనుమానం వస్తుంది. తిరుపతి ఎంపీగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను పెడితే ఆయన వ్యతిరేకత వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యేగా ఖరారు చేసిన ఎంపీ గురుమూర్తినే ఇంచార్జ్ ను చేశారు. ఇక గుంటూరులో ముగ్గురు పేర్లు మారిన తర్వాత సీనియర్ నేత ఉమ్మారెడ్డి అల్లుడు, పొన్నూరు ఎమ్మెల్యేను ఇంచార్జ్ గా నియమించారు. ఆయనైనా పోటీ చేస్తారా లేదా అన్నదానిపై స్పష్టత లేదు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా సింహాద్రి రమేష్ వెనుకడుగు వేస్తున్నారు. విశాఖ ఎంపీ అభ్యర్థిగా అనూహ్యంగా బొత్స ఝాన్సీని ఖరారు చేశారు. ఎంపీ టిక్కెట్ ఇచ్చిన గుమ్మనూరు జయరాం వెళ్లిపోతున్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూడా అంతే. అన్ని నియోజకవర్గాల్లోనూ అదే పరిస్థితి.

### ఇలా గందరగోళం చేసుకోవడం కూడా వ్యూహమేనా.?

సమన్వయకర్తలుగా ఉన్న వారు హైకమాండ్ ఆలోచనల ప్రకారం చూస్తే వీరంతా అభ్యర్థులుగా ఉండే అవకాశమే లేదని మార్పు చేర్పులు ఉంటాయని కూడా అంచనా వేస్తున్నరు. వైఎస్ఆర్సీపీ జాబితాలు చూసిన వారికి వీరంతా నిజంగా అభ్యర్థులు అవుతారా అన్నసందేహం వచ్చింది. ఎందుకంటే కొన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులు ఊహించని విధంగా ఉన్నారు. వారు ఆయా నియోజకవర్గాల్లో తట్టుకోగలరా అన్న ప్రశ్న కూడా వస్తోంది. అయితే అలాంటి వారు ఇవాళ కాకపోతే రేపైనా హైకమాండ్ తెలుసుకుంటుందని ఎన్నికల సమయానికి పరిస్థితిని తెలుసుకుని అభ్యర్థుల్లో మార్పు చేర్పులు చేస్తుందని నమ్ముతున్నారు. హైకమాండ్ ది కూడా అదే ఆలోచన. ఎన్నికల ముందు వరకూ పరిస్థితిని అంచనా వేసిన తర్వాతనే అభ్యర్థులను ఫైనల్ చేసే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రకటించిన జాబితాల్లోని వారిలో కనీసం 30 శాతం మందికి మార్పు చేర్పులు ఉంటాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో పట్టు సాధించిన వారు కాకుండా ఇతర నియోజకవర్గాల్లో ఏ పార్టీ తరపున అభ్యర్థులూ ఫైనల్ కారు. కూటమి అభ్యర్థులు ఫైనల్ అయిన తర్వాతనే వైసీపీ ఫైనల్ జాబితా రిలీజ్ చేసే చాన్స్ ఉందని నమ్ముతున్నారు. ఇలా గందరగోళం చేసుకోవడం కూడా వ్యూహమేనని వైసీపీ వర్గాలు చెబుతూండటం కొసమెరుపు.

# అంగన్వాడీల్లో సీసీ కెమెరాలు

గర్భిణీలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అందుకోసం అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టిసారించాలని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలను మొదటి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# టీఎస్ఆర్టీసీకి అవార్డుల పంట

కైవసం చేసుకుంది. టీఎస్ఆర్టీసీ గెలుచుకున్న ఈ 5 అవార్డులను ఈ నెల 15న ఢిల్లీలో టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఏఎస్ఆర్టీయూ ప్రకటించింది. ఇదిలా ఉంటే టీఎస్ఆర్టీసీ 5 జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకోవడం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడం వల్లే సంస్థకు ఈ పురస్కారాలు వచ్చాయని మంత్రి ప్రశంసించారు. అవార్డులు వచ్చేలా కృషిచేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని పొన్నం ప్రభాకర్ అభినందించారు. నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులను గెలుచుకోవడంతో ప్రజా రవాణా వ్యవస్థలో టీఎస్ఆర్టీసీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ పేర్కొన్నారు. సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి ఈ అవార్డులు చిహ్నమని సజ్జనార్ అభినందిచారు.

# ఇళ్లు లేని వారికి గుడ్‌న్యూస్

ఇదివరకే సొంత స్థలం ఉన్న వారికైతే ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల రూపాయలు అందించనున్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు స్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారంటీల అమలులో భాగంగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. (మార్చి 2న) శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించిన మార్గదర్శకాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఇతర అధికారులు ఇందులో పాల్గొన్నారు.

### ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ పథకం వర్తింపు

రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద అర్హులందరికీ ఈ పథకం వర్తింపజేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. అందుకు అనుగుణంగా విధి విధానాలను తయారు చేయాలన్నారు. ప్రజా పాలనలో నమోదు చేసుకున్న అర్హులందరికీ ముందుగా ప్రాధాన్యమివ్వాలని అన్నారు. గత ప్రభుత్వం డబుల్ ఇండ్ల నిర్మాణంలో చేసిన తప్పులు జరగకుండా, అసలైన అర్హులకు లబ్ధి జరిగేలా చూడాలని అధికారులను అప్రమత్తం చేశారు. ముందుగా ఒక్కో నియోజకవర్గానికి 3500 ఇళ్లను మంజూరు చేయాలని సూచనప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. దశల వారీగా నిరుపేదల సొంత ఇంటి కల నెరవేర్చడం తమ ప్రభుత్వ సంకల్పమని రేవంత్ అన్నారు.

### ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ఇంటి స్థలం ఉన్న వారికి అదే స్థలంలో కొత్త ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇస్తారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5 లక్షలు అందిస్తారు. ఏయే దశల్లో ఈ నిధులను విడుదల చేయాలనే నిబంధనలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు అందాల్సిన నిధులు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని చెప్పారు. సొంత జాగాలో ఇల్లు కట్టుకునే వారికి పలు రకాల ఇంటి నమూనాలు, డిజైన్లను తయారు చేయించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. లబ్ధిదారులు సొంత ఇల్లు తనకు అనుగుణంగా నిర్మాణం చేపట్టినప్పటికీ తప్పనిసరిగా ఒక వంటగది, టాయిలెట్ ఉండేలా చూడాలన్నారు. ఇంటి నిర్మాణాలను పర్యవేక్షించే బాధ్యతలను వివిధ శాఖల్లో ఉన్న ఇంజనీరింగ్ విభాగాలకు అప్పగించాలని సీఎం సూచించారు. జిల్లా కలెక్టర్ల అధ్వర్యంలో ఇంజనీరింగ్ విభాగాలకు ఈ బాధ్యతలను ఇవ్వాలని చెప్పారు.

# జగన్ ఇంటికెళ్లడం ఖాయం

సమక్షంలో శ్రీకృష్ణదేవరాయల సైకిలెక్కారు. ప్రజలంతా రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి సిద్ధంగా ఉండాలని చంద్రబాబు నాయుడు అన్నారు. జిల్లాకు సంబంధించి వరికిపుడిసేల ఎత్తిపోతల పథకాన్ని అధికారంలోకి రాగానే పూర్తి చేస్తామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో కులం, మతం చూడకుండా మంచి చేసే నాయకుడికి ఓటు వేయాలన్నారు. యరపతినేని పార్టీ కోసం ఎంతో చేశారని గుర్తు చేశారు. జగన్ బాబాయ్ ఎవరో చంపారో ఇప్పటికైనా చెప్పాలని చంద్రబాబు డిమాండ్ చేశారు. హత్యలు చేసేవారు రాజకీయాల్లోకి వస్తే ప్రమాదన్నారు. సీఎం జగన్ ది యూజ్ అండ్ త్రో పాలసీ అని అన్నారు. వైసీపీని ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. 40 రోజుల్లోగా జగన్ ఇంటికి వెళ్తాడని చంద్రబాబు జోస్యం చెప్పారు. తాడేపల్లిగూడెం, ఇడుపులపాయ, కడప, హైదరాబాద్, బెంగళూరులో జగన్ ప్యాలెసులున్నాయని చంద్రబాబు ఆరోపించారు. వైజాగ్ రుషికొండలో మరో ప్యాలెస్ నిర్మించుకున్నారని చెప్పారు. జనసేన, టీడీపీలో విభేదాలు సృష్టించలేరని స్పష్టం చేశారు. వైసీపీ అప్పులపాలు చేస్తే.. టీడీపీ ఆదాయం సృష్టించే పార్టీ అని చెప్పుకొచ్చారు. పల్నాడు జిల్లాలో 30 మంది టీడీపీ కార్యకర్తలు, నేతలను హత్యలు చేశారని ఆరోపించారు. జిల్లాలోని నరహంతకులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కోడెలను వేధించి ఆయన మృతికి కారణమయ్యారని ఆరోపించారు. ఎస్టీ మహిళను ట్రాక్టర్ తో ఢీకొట్టించి చంపారని తెలిపారు. ఎలాంటి తప్పు చేయని ప్రతిపాటి శరత్ అరెస్ట్ చేశారని అన్నారు. ఈ ఆటలు ఎన్నో రోజులు సాగవని చంద్రబాబు అన్నారు. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రాబోతుందన్నారు.

# 195 మందితో లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితా విడుదల

డామన్ డయ్యూలో 1 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అరుణాచల్ ప్రదేశ్ నుంచి కిరణ్ రిజిజు బరిలోకి దిగనున్నారు. ఉత్తర ఢిల్లీ నుంచి మనోజ్ తివారి పోటీ చేయనున్నారు. గుజరాత్‌లోని పోర బందర్ నుంచి మన్‌సుఖ్ మాండవియ, అసోంలోని డిబ్రుఘర్ నుంచి శర్బానంద్ సోనోవాలా పోటీ చేస్తారని వినోద్ తావడే వెల్లడించారు. జమ్ముకశ్మీర్‌లోని ఉదంపూర్ నుంచి జితేంద్ర సింగ్ పోటీ చేయనున్నారు. త్రిసూర్ నుంచి సురేశ్ గోపీ, పథనం తిట్ట నుంచి ఏకే ఆంటోని బరిలోకి దిగనున్నారు. మధ్యప్రదేశ్‌లోని గుణ నియోజకవర్గం నుంచి జ్యోతిరాదిత్య సింధియా, విదిశా నియోజకవర్గం నుంచి శివరాజ్ సింగ్ చౌహాన్ పోటీ చేయనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వారణాసి నుంచే బరిలోకి దిగనున్నారు. ఎప్పటిలాగే అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీ చేయనున్నారు. దాదాపు 15 రోజులుగా ఈ జాబితాపై మేధోమథనం చేస్తోంది అధిష్ఠానం. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితాని పూర్తిగా పరిశీలించి ఆ తరవాత ఆమోద ముద్ర వేశారు. ఇప్పుడిదే లిస్ట్‌ని విడుదల చేశారు. ఈ సారి 370 స్థానాలు గెలుచుకోవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతోంది బీజేపీ. అంతే కాదు. ఎన్డీఏ కూటమి 400 చోట్ల తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఫిబ్రవరి 29న రాత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాని ఫైనలైజ్ చేయడంపై చర్చించారు. అయితే అంతకు ముందు క్షేత్రస్థాయిలో నుంచి ఒక్కో అభ్యర్థి గురించి ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంది బీజేపీ. ఇందుకు నమో యాప్ ని వినియోగించుకుంది. స్థానిక ఎంపీ పని తీరు ఎలా ఉందో చెప్పాలంటూ ఒపీనియన్ పోల్ పెట్టింది. అంతే కాదు. ఒక్కో ప్రాంతంలో ప్రజలకు ఎక్కువగా నచ్చిన ముగ్గురు నేతల పేర్లను సేకరించింది. స్థానిక ప్రజలకు ఆయా నేతలు ఏ మేరకు అందుబాటులో ఉంటున్నారు.? వాళ్ల పని తీరు ఎలా ఉంది.? అనే కోణాల్లో అభిప్రాయాలు సేకరించింది.

## యాదాద్రి కాదు
# ఇక యాదగిరిగుట్ట

పోతాడు. కాళేశ్వరం కట్టిన చీఫ్ డిజైనర్ కేసీఆర్ మేడిగడ్డ ఎందుకు పోలేదు? కాళేశ్వరం పనికిరాదని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చింది. ప్రజలే కేసీఆర్‌ను నామరూపాలు లేకుండా చేశారు. ఎంపీ అభ్యర్థులపై అంతర్గత సర్వే జరుగుతోంది. భువనగిరి నుండి పోటీ చేయమని రాహుల్ గాంధీని కోరాను. భువనగిరి, ఖమ్మం, నల్గొండలో దక్షిణాదిలో టాప్ మెజార్టీ వస్తుంది. మోదీ కంటే రాహుల్ గాంధీ ఎక్కువ మెజారిటీతో గెలుస్తారు' అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. యాదగిరిగుట్టను కేసీఆర్ సీఎం అయిన తర్వాత అభివృద్ధి చేశారు. యాదాద్రిగా పేరు మార్చారు. కానీ యాదగిరిగుట్టగానే ఎక్కువ మంది పిలుస్తున్నారు.

అదేపేరు ఉండాలన్న డిమాండ్ చాలా కాలంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరోసారి తెరపైకి వచ్చింది. యాదాద్రి పేరును మళ్లీ యాదగిరిగుట్టగా మారుస్తామని ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య రెండు రోజుల కిందట ప్రకటించారు. సీఎం రేవంత్ రెడ్డి త్వరలోనే ఆలయాన్ని సందర్శిస్తారని చెప్పారు. ఆలయ అభివృద్ధిపై రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చారు. నెల రోజుల్లోగా సమీక్ష సమావేశం నిర్వహిస్తామని అయిలయ్య వెల్లడించారు. క్షేత్రానికి పూర్వం నుంచి ఉన్న పేరును మార్చడం సరికాదన్న అయిలయ్య తిరిగి యాదగిరిగుట్టగా పేరు మార్చే ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు.

అయితే యాదగిరిగుట్టగా ఉన్న పేరును మాజీ సీఎం కేసీఆర్ యాదాద్రిగా మారుస్తూ గతంలో నిర్ణయం తీసుకున్నారు. తిరుమల వెంకన్న ఆలయం స్థాయిలో ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో యాదాద్రి అని నామకరణం చేస్తూ ఆలయాన్ని పునర్నిర్మించాలని నిర్ణయించినప్పుడు ప్రకటించారు. యాదాద్రి పేరును చినజీయర్ స్వామి సూచించారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ తర్వాత యాదాద్రిని తిరిగి యాదగిరిగుట్టగా మారుస్తారనే వార్తలు వచ్చాయి. క్షేత్ర పర్యటనకు అప్పట్లో సీఎంగా ఉన్న కేసీఆర్ వచ్చిన సమయంలో యాదగిరిగుట్ట అనే పేరుతోనే ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటనలు విడుదల చేసింది. దీంతో గుడి పేరును తిరిగి యాదగిరిగుట్టగా మారుస్తున్నారనే వార్తలు వచ్చాయి. అయితే దానిపై ఎలాంటి ఉత్తర్వులు వెలువడలేదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక నిర్ణయం తీసుకుని జీవో విడుదల చేసే అవకాశం ఉంది.

# పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్. ఐ తిమ్మ రెడ్డి




**సి. బెలగల్** సి.బెలగల్ మండల కేంద్రంలోని యనగండ్ల, మూడుమల,కొండాపురం లోని పోలింగ్ బూత్ లను ఎస్. ఐ తిమ్మా రెడ్డి పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామ ప్రజలతో మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని సార్వత్రిక ఎన్నికల సజావుగా జరగాలని,ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘర్షణలకు జరగకుండా ఉండాలని సూచించారు. అలాగే గ్రామాలలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు అటువంటి వారిపైన శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్.ఐ వెంట పోలీస్ సిబ్బంది శ్రీరాములు ఉన్నారు.

# దేశం గర్వించదగ్గ గొప్ప నాయకులు పివి

**- సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్** దేశం గర్వించదగ్గ గొప్ప నే పివి నరసింహరావు అని సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కొనియాడారు. శనివారం బేగంపేట లోని ఖుం నర్సింహారావు భవన్ లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో అయన పాల్గొన్నారు. తలసానిమాట్లాడుతూ పివి నర్సింహారావు కు భారతరత్న ప్రకటించడం దేశానికే గర్వకారణం. భారతరత్న ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు. ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని సంస్కరణలు తీసుకొచ్చి అభివృద్ధి లోకి తీసుకొచ్చిన ఘనత పివి నర్సింహారావు కే దక్కుతుంది. దేశ ప్రధానమంత్రి గా పని చేసిన ఏకైక తెలుగు వ్యక్తి పివి అని అన్నారు.

# యూత్ కాంగ్రెస్ సంబరాలు

**హైదరాబాద్** తెలంగాణ ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకటించడం పట్ల యూత్ కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల వద్ద యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనా రెడ్డి ఆధ్వర్యంలో కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రభుత్వం 11,062 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయడం నిరుద్యోగులకు ఊరటనిచ్చే అంశం అంటూ కొనియాడారు. అసలు సిసలైన తెలంగాణ ఇప్పుడు వచ్చిందని తెలంగాణ విద్యార్థులు, నిరుద్యోగులు అందరూ అభిప్రాయపడుతున్నారని అని చెప్పారు. విద్యార్థులందరికీ కాంగ్రెస్ ప్రభుత్వం లో కొలువుల జాతర ఏర్పడిందని అన్నారు. దాదాపు పది సంవత్సరాలలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో టీఎస్పీఎస్సీ ద్వారా కేవలం 35 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారని అన్నారు.

తెలంగాణ వస్తే మా కొలువులు మాకు వస్తాయని ఆశపడ్డ విద్యార్థులకు పదేళ్లలో ఉద్యోగాలు రాక వయసు దాటిపోయి ఏం చేయాలో తెలియని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న 10 ఏళ్లలో డిగ్రీలు చేసిన విద్యార్థి, నిరుద్యోగులు ఉద్యోగాలు రాక చిరు వ్యాపారాలు పెట్టుకొని బతుకు వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో జూన్ 2 తారీకు వరకు రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాలు అన్నిటిని భర్తీ చేస్తామని దీనిపై సీఎం రేవంత్ రెడ్డి చాలా సీరియస్ గా ఉన్నారని స్పష్టం చేశారు.

# మేడ్చల్ పారిశ్రామిక వాడలో అగ్ని ప్రమాదం

**మేడ్చల్** మేడ్చల్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. శనివారంమేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియా లోని అటవీ ప్రాంతంలో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. అగ్ని ప్రమాదం జరిగిందని సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చిన అధికారులు పట్టించుకోలేదు స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులు బకెట్లలో నీరు తో మంటలు ఆర్పడానికి ప్రయత్నిస్తున్నారు. అగ్ని ప్రమాదం గల సంబంధించి కారణాలు తెలియరాలేదు

# పొత్తును చెడగోడుతున్న చేగొండి




**తిరుపతి** లేఖల వీరుడు హరిరామజోగయ్య కష్టపడి పొత్తును చెడగొట్టాలని చూస్తున్నారు. ముద్రగడ, హరిరామజోగయ్యలు కాపులు ఇంకా అమాయకులు అనుకుంటూన్నారని జనసేన ఇన్ చార్జ్ కిరణ్ రాయల్ అన్నారు. నెంద్రాకాయ్ కథలా ఇద్దరి వ్యవహారం ఉంది. పవన్ కళ్యాణి కుటుంబాన్ని తిట్టినప్పుడు లేఖలు ఎందుకు రాయలేదు. మీ లేఖలు మడిచి మీ దగ్గరే పెట్టుకోండి. ముప్పై ఎళ్ళ క్రితం కాపులు వేరు ఇప్పుడు ఉన్న కాపులు వేరు గుర్తుపెట్టుకొండి. కాపులకు బాగా రాజకీయాలు తెలుసుకున్నారు... ప్రజారాజ్యం టైం కాదు ఇది... మీ డ్రామాలు,వెన్నుపోటు రాజకీయాలు అందరికీ తెలుసు. ఇక సాగవు. కన్న కొడుక్కి సలహాలు ఇవ్వలేవు...కాని పవన్ మాత్రం లేఖలు రాస్తారా. కూమారుడికి హరిరామజోగయ్య మంత్రి పదవీ కావాలని, పవర్ షేరింగ్ కావాలని,నలబై సీట్లు కావలనే వైసిపికి లేఖ రాసే దమ్ముందా. పవన్ కల్యాణ్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే నాలుక కోస్తాం. ఎంత ప్యాకేజీ తీసుకుని వైసిపిలో వెళ్ళాడు మీ కోడుకు. అ లేఖలు అన్ని తాడేపల్లి గూడెం వస్తున్నాయని అన్నారు. .

# సర్పంచుల అందోళన

**ఏలూరు** ఏలూరు కలెక్టర్ కార్యాలయంవద్ద ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వై.వి.బి. రాజేంద్ర ప్రసాద్, ఆధ్వర్యంలో సర్పంచుల సంఘం ధర్నా కు దిగింది. సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్, జిల్లా రాష్ట్ర, నాయకులు కలిసి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లే క్రమంలో పోలీసులకు సర్పంచులకు వాగ్వివాదం జరిగింది. సర్పంచులు బారికెట్లను తోసుకొని కలెక్టరేట్ ప్రాంగణానికి చేరుకున్నారు. గత మూడు సంవత్సరాలుగా గ్రామాలలో అభివృద్ధి పనులు ఏమి చేయలేక రోడ్లు డ్రైన్స్ తాగునీరు వీధి దీపాలు మొదలగు అభివృద్ధి పనులు ఏమీ చేయకుండా పంచాయతీ నిధుల్లో నుండి వైసీపీ ప్రభుత్వం సొమ్ము కా చేసిందని, 14 15 ఆర్థిక సంఘం నిధులు వేల కోట్ల రూపాయలు దారి మళ్లించి సొంత పథకాలకు వాడుకుంటుందని రాజేంద్రప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సర్పంచుల సంఘం ప్రభుత్వాన్ని హెచ్చరించింది

## త్వరలోనే జై హనుమాన్

# ఫస్ట్‌లుక్




త్వరలోనే 'జై హనుమాన్' ఫస్ట్‌లుక్ విడుదల చేయబోతున్నట్లు దర్శకుడు ప్రశాంత్ వర్మ తెలిపారు. సంక్రాంతి కానుకగా వచ్చిన 'హనుమాన్' మూవీ 150 థియేటర్‌లలో 50 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా చిత్ర బృందం 'హిస్టారికల్ 50 డేస్' కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిత్ర పరిశ్రమలో ఓ సినిమాకు సంబంధించి 50 రోజుల కార్యక్రమం జరిగి చాలా రోజులైంది. ఇన్నేళ్ల తర్వాత 'హనుమాన్'కు జరగడం సంతోషంగా ఉంది. ఒక సినిమా విజయం చాలా మంది జీవితాలను మారుస్తుంది. 'హనుమాన్' మా మొత్తం టీమ్‌కు పేరు తెచ్చింది. ఒకప్పుడు ఇలాంటి కార్యక్రమాలను సినిమా ప్రమోషన్స్ కోసం చేసేవాళ్లు. తమ మూవీ వారం రోజులు ఆడి, పెట్టిన డబ్బులు వస్తే చాలులే అనుకుంటున్న ఈ రోజుల్లో 50 రోజుల ఫంక్షన్ చేయడం చాలా మంది నిర్మాతల్లో నమ్మకాన్ని తీసుకొస్తుంది. ఎంతో మంది స్ఫూర్తి పొందుతారు. నా మొదటి సినిమా 'అ!' మంచి విజయాన్ని అందుకుని, విమర్శకులను సైతం మెప్పించింది. ఆ సమయంలో ఇలాంటి వేడుక చేయలేకపోయాం. ఆ మూవీ కమర్షియల్‌గా హిట్ కాలేదని చాలా మంది అనుకున్నారు. 'హనుమాన్' రీమాస్టర్ వెర్షన్ తీసుకొస్తున్నాం. అది ఇంకా సర్‌ప్రైజింగ్‌గా ఉంటుంది. ప్రశాంత్ సినిమాటిక్ యూనివర్స్‌కి ఈ మూవీ మంచి పునాది వేసింది. మీరిచ్చిన ప్రోత్సాహంతో క్వాలిటీ సినిమాలు చేస్తాం. సినిమా విడుదలైన దగ్గరి నుంచి మేము అస్సలు పార్టీ చేసుకోలేదు. అంతర్జాతీయంగానూ ఈ మూవీని ఎలా తీసుకువెళ్లాలా? అని ప్రయత్నాలు చేశాం. స్పెయిన్, జపాన్, చైనా డిస్టిబ్యూటర్స్‌తో మాట్లాడాం.

వాళ్లకూ ఈ మూవీ నచ్చింది. త్వరలోనే విడుదల చేస్తున్నాం. ప్రపంచదేశాల్లో తెలుగు మూవీ గొప్పతనాన్ని 'హనుమాన్' చాటబోతోంది"జై హనుమాన్'కు సంబంధించిన పని మొదలైంది. త్వరలోనే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తాం. ఇందులో హనుమంతుడే హీరో. 'హనుమాన్' క్లైమాక్స్ ఏవిధంగానైతే విపరీతంగా నచ్చిందో కొత్త మూవీ రెండున్నర గంటల పాటు అదే థ్రిల్, జోష్‌తో ఉంటుంది. కచ్చితంగా మీరు గర్వపడేలా సినిమా తీస్తా. మీరు అందించిన విజయాన్ని బాధ్యతగా తీసుకుని, 'జై హనుమాన్' తీర్చిదిద్దుతా' అని ప్రశాంత్ వర్మ అన్నారు.

## ఒకేకారులో ఎయిర్‌పోర్టులో

# దర్శనమిచ్చిన రామ్...చరణ్



చరణ్ గురించి తారక్, తారక్ గురించి చరణ్.. ఎన్నో విషయాలు షేర్ చేసుకుంటారు.. ఇప్పుడు మళ్లీ వారిద్దరూ ఒకే కారులో కనిపించి.. అందరినీ ఆశ్చర్యపరిచారు.తారక్, చరణ్ ఇద్దరూ వారి ఫ్యామిలీలతో కలిసి వేరు వేరు ఫంక్షన్స్‌కి హాజరయ్యే నిమిత్తం.. ఇద్దరూ కలిసి ఒకే కారులో ఎయిర్‌పోర్ట్‌కి రావడం విశేషంగా మారింది. రామ్ చరణ్, ఉపాసన దంపతులు ముకేశ్ అంబానీ తనయుడు వివాహానికి హాజరయ్యే నిమిత్తం ముంబై.. తారక్, లక్ష్మీ ప్రణతి దంపతులు బెంగళూర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌కు హాజరయ్యేందుకు పయనమయ్యారు. ప్రస్తుతం వారు గమ్యస్థలాలకు చేరుకున్న వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. అయితే ఆ ఈవెంట్స్ వెళ్లే నిమిత్తం.. చరణ్, తారక్ ఇద్దరూ ఒకే కారులో నుంచి దిగి ఎయిర్ పోర్ట్‌కు వెళుతున్న వీడియో ప్రస్తుతం బాగా వైరల్ అవుతోంది. ఈ వీడియో చూసిన వారంతా.. మరోసారి ఇద్దరూ వారి మధ్య ఉన్న బాండింగ్‌ని తెలియజేశారంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్' అనే సినిమా చేస్తున్నారు. ఈ సినిమా అనంతరం 'ఉప్పెన' దర్శకుడు బుచ్చిబాబు సానా తో ఓ సినిమా కమిటయ్యారు. తారక్ ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' అనే సినిమా, బాలీవుడ్‌లో 'వార్ 2' సినిమాలు చేస్తున్నారు. ప్రశాంత్ నీల్‌తో ఓ సినిమా కమిటై ఉన్నారు.

## దేశభక్తితో తెరకెక్కిన

# చిత్రం ఆర్టికల్ 370

### యామీ గౌతమ్ వెల్లడి

యామీ గౌతమ్ ప్రధాన పాత్రలో ఆదిత్య సుహాస్ జంభాలె తెరకెక్కించిన చిత్రం 'ఆర్టికల్ 370' ఫిబ్రవరి 23న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాపై కొన్ని దేశాలు నిషేధం విధించడం చర్చనీయాంశం అయిన విషయం తెలిసిందే. కొన్ని సన్నివేశాలు ఆందోళనకరమైన ధోరణిలో ఉన్నాయని అందుకే నిషేధించినట్టు సమాచారం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ వార్తలపై స్పందించిన యామీ గౌతమ్ 'ఆర్టికల్ 370' దేశంపై ఉన్న భక్తితో తెరకెక్కించిన సినిమా అని తెలిపారు. 'సినిమా చూడకుండానే తీర్పు చెప్పేవారు ఉంటారు. కానీ ఆర్టికల్ 370 నిషేధాన్ని మేము ఊహించలేదు. ఇందులో ఆందోళనకరమైన సన్నివేశాలు లేవు. ప్రేరణ కలిగించే వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందింది. మంచి సినిమా చూసి ఇంటికి వెళ్తున్నామన్న అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది. అది మా చిత్రబృందానికి ఎంతో ఆనందాన్ని ఇస్తుంది. సినిమా చూశాక తీర్పు చెప్పాలి కానీ ముందే ఎలా ఓ నిర్ణయానికి వస్తారు? ఈ సినిమా కశ్మీర్ అభివృద్ధికి తోడ్పడుతుంది. ప్రచారం కోసం చేసింది కాదు' అని యామీ గౌతమ్ వెల్లడించారు.కశ్మీర్‌లో జరిగిన పరిస్థితుల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. ఇందులో యామీగౌతమ్ ఇంటెలిజెన్స్ ఏజెంట్‌గా యాక్షన్ అవతారంలో నటించారు. ప్రియమణి కీలక పాత్రలో కనిపించారు. ఈ సినిమా ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంటోంది.




## భర్త విఘ్నేష్‌ను అన్‌ఫాలో


# చేసిన నయనతార



దక్షిణాదిన అగ్రనటీమణుల్లో వెలుగొందుతున్న నయనతార సామాజిక మాధ్యమాల్లో ఈమధ్యనే ఆరంగేట్రం చేశారు. ఆమె తన కవల పిల్లల ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్ లో మొదటి పోస్టుగా పెట్టి జాయిన్ అయ్యారు. ఆ తరువాత ఆమెకి వందల, వేల, లక్షల మంది అభిమానులు ఫాలో అవటం మొదలెట్టారు. ఈరోజు ఆమెకి ఇన్‌స్టాగ్రామ్ లో 78 లక్షల మంది ఫాలోవర్స్ (7.8 మిలియన్) వున్నారు. ఇప్పుడు నయనతార వార్తల్లో వున్నారు. ఎందుకంటే ఆమె తన భర్త విఘ్నేష్ శివన్ ని ఇన్‌స్టాగ్రామ్ లో అన్ ఫాలో చేశారు. ఎందుకు అలా చేశారో ఎవరికీ తెలియదు కానీ నయనతార అభిమానులు మాత్రం ఈ విషయంపై రకరకాలుగా చర్చించు కుంటున్నారు. అదేదో పొరపాటున ఆలా అయింది అని అదేమంత పెద్ద విషయం కాదని ఇలా అనుకుంటున్నారు. కొందరైతే సాంకేతిక కారణాలు ఉండొచ్చు అని కూడా అంటున్నారు. ఇలా ఎవరికీ వారు అనుకుంటున్నా, నయనతార ఇన్‌స్టాగ్రామ్ లో మాత్రం ఆమె తన భర్తని ఫాలో అవుతున్నట్టు మళ్ళీ చూపిస్తోంది. ఏదైనా సాంకేంతిక లోపం వలన కొన్ని గంటలపాటు అన్ ఫాలో అయినట్టు కనిపించక పోవచ్చు అని కూడా అంటున్నారు. పని పరంగా చూస్తే నయనతార ఈమధ్యనే షారుఖ్ ఖాన్ తో నటించిన హిందీ సినిమా 'జవాన్' చాలా పెద్ద విజయం సాధించింది. ఇప్పుడు 'టెస్ట్' అనే సినిమాలో నటిస్తున్నారు, ఇందులో మాధవన్, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ఇతర పాత్రల్లో కనిపిస్తున్నారు. శశికాంత్ ఈ సినిమాకి దర్శకుడు.

## శశివదనే చిత్రం నుంచి

# పాట విడుదల




'పలాస 1978'లో అద్భుతమైన నటనతో అందరి ప్రశంసలు అందుకున్న రక్షిత్ అట్లూరి కథానాయకుడిగా నటించిన చిత్రం 'శశివదనే'. కోమలి ప్రసాద్ కథానాయికగా నటిస్తోంది. 'మనసులో పుట్టే ప్రేమ మచ్చలేని దైతే ఆ ప్రేమకు మరణం కూడా మనతోనే' అంటూ హృదయాన్ని హత్తుకునే గ్రామీణ నేపథ్యంలో ప్రేమ కథాంశంగా తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 5న గ్రాండ్ రిలీజ్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన ఈ మూవీ పాటలు, టీజర్‌కు అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా నుంచి 'ఏమిటో ఏమిటో..' అనే పాటను విడుదల చేశారు. హీరోయిన్‌పై మనసుపడ్డ హీరో తన మనసులో చేలరేగె భావాలను పాట రూపంలో వ్యక్తం చేసే క్రమంలో పాట వచ్చే సందర్భంగా అనిపిస్తోంది. అదేంటో తెలుసుకోవాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే అంటున్నారు దర్శక నిర్మాతలు. పి.వి.ఎన్.ఎస్.రోహిత్ పాడిన ఈ పాటను కరుణాకర్ అడిగర్ల రాశారు. శరవణ వాసుదేవన్ ఈ చిత్రానికి సంగీతాన్ని అందించారు.÷బిరీ నాయుడు సమర్పణలో ంఉ ఫిల్మ్ కంపెనీ, ÷ూ స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్స్‌పై అహితేజ బెల్లంకొండ (ంతతిబిIతీజీ ్గ్ర÷జీపీనీనిటజీ), అభిలాష్ రెడ్డి గోదాల ఈ చిత్రాన్ని నిర్మించారు. రైటర్, డైరెక్టర్ సాయి మోహన్ ఉబ్బన సినిమాను తెరకెక్కించారు. ఇప్పటి వరకు వచ్చిన మూవీ కంటెంట్‌తో.. ఈ ప్రేమకథా చిత్రంలో గోదావరి జిల్లాల అందాలను ఎలా చూపించబోతోన్నారు అనే దానిపై ఓ స్పష్టత వచ్చింది. ఈ చిత్రంలో రంగస్థలం మహేష్, శ్రీమాన్, జబర్దస్త్ బాబీ, ప్రవీణ్ యండమూరి మరియు దీపక్ ప్రిన్స్ కీలక పాత్రలు పోషించారు.

# బుల్లితెర నటుడు పవిత్రనాథ్ కన్నుమూత

బుల్లితెర మీద అత్యంత ప్రజాదరణ పొందిన సీరియల్ లలో 'మొగిలిరేకులు' సీరియల్ లో 'దయ' పాత్రలో నటించిన, అందరికీ సుపరిచుడు అయిన పవిత్రనాథ్ కన్నుమూశారు. ఈ విషయాన్ని సహచర నటుడు ఇంద్రనీల్ భార్య మేఘన తన సామాజిక మాధ్యమం ద్వారా చెప్పడంతో అందరికీ తెలిసింది. 'ఈ వార్త నిజం కాకూడదు అని అనిపిస్తే ఎంతో బాగుండేది అనిపిస్తుంది. నువ్వు ఎంతో ముఖ్యమైన వ్యక్తివి మాకు, నువ్వు ఇలా మమ్మల్ని వదిలి వెళ్ళిపోవటం చాలా బాధగా వుంది. నీకు కనీసం వీడ్కోలు కూడా చెప్పలేకపోయాం,' అని పెట్టారు. ఇంద్రనీల్ భార్య తన సామాజిక మాధ్యమంలో పవిత్రనాథ్ గురించి పోస్ట్ పెట్టారు కానీ, పవిత్ర నాథ్ ఎలా మరణించింది, ఏమైంది అనే విషయాలు మాత్రం బయటకి రాలేదు అని తెలుస్తోంది. 'మొగిలి రేకులు' సీరియల్ తో పాటు ఇంకో సీరియల్ 'చక్రవాకం' లో కూడా పవిత్రనాథ్ నటించాడు. ఈ రెండు సీరియల్స్ అత్యంత ప్రజాదరణ పొందిన సీరియల్స్. ఇందులో ఆ నటులు నిజమైన పేర్లు కాకుండా, సీరియల్స్ లోని పాత్రల పేర్లే ప్రేక్షకులకి ఎక్కువ గుర్తుండిపోయాయి అని చెపుతూ వుంటారు.

# భద్రాద్రి రాముని కి భరోసా ఏదీ.?

- పట్టు వస్త్రాలు, తలంబ్రాల ఆనవాయితి అంతమేనా
- అభివృద్ధికి ఆకాశమంత దూరంలో
- భద్రాద్రిపై ప్రభుత్వాల శీతకన్ను
- ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఎప్పుడు నిధుల కొరత
- సమస్యలతో భక్తుల సతమతం
- పాలక మండలి లేక పదేళ్లు
- రాములవారి భూములు ఆంధ్రాలోనేనా
- ఆ నిజాంకు ఉన్న ప్రేమ ఈ నిజాం లకు లేకపాయే
- అసలే పట్టించుకోని గత ప్రభుత్వం
- భట్టి, తుమ్మల, పొంగులేటి అయిన ఆలయ అభివృద్ధి చేసేనా





**భద్రాచలం (ప్రశ్న న్యూస్)** భారతదేశంలో అత్యంత పవిత్రమైన పుణ్యక్షేత్రాలలో భద్రాచలం మొదటి స్థానంలో ఉంటుంది. శ్రీ సీతారామచంద్ర స్వామి వారు లక్ష్మణ మూర్తి తో కలిసి నడయాడిన పవిత్ర ప్రదేశం భద్రాచలం. భారత దేశంలో అత్యధికంగా సనాతన ధర్మాన్ని ఆచరించి, అనుసరించే హిందూ ప్రజలు రాములవారిని తమ ఆరాధ్య దైవంగా, తమకు రాముడే మార్గదర్శకుడిగా, ఆదర్శ పురుషునిగా కొలుస్తారు, పూజిస్తారు. అంతటి మహా దైవస్వరూపి శ్రీ రామచంద్ర స్వామి. సాక్షాత్తు ఆయనే స్వయంగా తన భార్య సీతమ్మతల్లి, సోదరుడు లక్ష్మణుడితో భద్రాచలం దండకారణ్యంలో సంచరించి నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడని హిందువుల పవిత్ర గ్రంధాలు తేటతెల్లం చేస్తున్నాయి. నిజాం ప్రభువుల పాలనలో 17 వ శతాబ్దంలో భద్రాచలం పరగణాలో తహసిల్దార్ గా పనిచేస్తున్న కంచర్ల గోపన్న ప్రభుత్వ ఖజానా పైకంతో రాముల వారికి ఎంతో భక్తి శ్రద్ధలతో 1674 వ సంవత్సరంలో ఆలయాన్ని నిర్మించారు. అందుకు కోపోగ్రుతుడైన నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ కంచర్ల గోపన్నను గోల్కొండ కోటలో బందించగా, సాక్ష్యాత్తు శ్రీ రామచంద్రుడే నిజాం నవాబుకు కలలో కనబడి కప్పం చెల్లించడంద్వారా గోపన్నను గోల్కొండ కోట నుండి విడుదల చేసినట్లు చరిత్ర చెబుతుంది. మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ప్రతి సంవత్సరం రామాలయ అభివృద్ధి నిధుల కోసం 82 వేల రూపాయలను చెల్లించేవాడు. రాములవారు కలలో దర్శనమివ్వడంతో అప్పటి నుండి ప్రతి సంవత్సరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణానికి ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించే ఆనవాయితి నెలకొంది. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వమే పట్టు వస్త్రాలు, తలంబ్రాలు తీసుకురావడం అనవాయితీగా కొనసాగుతోంది. అంతటి విశిష్టమైన స్థానాన్ని దక్కించుకుంది భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయం. దేశంలో ఎక్కడా జరగని విధంగా రాముల వారి కళ్యాణం నిర్వ హిస్తారు. అంతటి విశిష్టమైన ప్రాశస్త్యం కలిగిన భద్రాచల రాముల వారి ఆలయం గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నిరాదరణకు, అభివృద్ధికి ఆకాశమంత దూరంలో నిలిచింది. భద్రాచలం రాముల వారి ఆలయంపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబించడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వం ఆలయ అభివృద్ధిని పట్టించుకోకుండా తీరని ద్రోహం, అన్యాయం చేసింది. ఆలయ అభివృద్ధికి వంద కోట్ల రూపాయల నిధులు తక్షణమే మంజూరు చేస్తామన్న మాటలు నీటి మీద రాతలు లాగే మిగిలాయి. యాదాద్రి మీద ఉన్న ప్రేమ భద్రాద్రి రాముడి మీద లేకపోవడం కొంత ఆచర్యానికి, కొంత అనుమానాలకు తావిస్తుంది. రాష్ట్ర పాలనకు ప్రభుత్వ ఏర్పాటు ఎంత అవసరమో, ఆలయాల అభివృద్ధికి, పాలనకు పాలక మండలి అంత అవసరం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆలయ పాలక మండలి పనిచేసింది. రాష్ట్ర విభజన తరువాత భద్రాద్రి రామాలయానికి పాలక మండలి ఏర్పాటు చేయక పది సంవ్సరాల కాలం గడిచిపోయింది. పాలక మండలి లేకపోవడం వలన జరిగే అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిలిచిపోయాయి. భద్రాచల రాముడు, తెలంగాణ దేవుడు అని ఆంధ్ర ప్రాంతం లోనికి భద్రాచలం పోకుండా అనేక పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో భద్రాచలం ప్రాంతం, రామాలయం రాజకీయ నాయకుల స్వార్థం కారణంగా నిరాదరణకు గురైంది. రాములవారి భూములు మొత్తం సుమారు వెయ్యి ఎకరాల భూమి ఆంధ్ర ప్రాంతంలో ఉన్నది. ఈ భూముల కోసం గత ప్రభుత్వ పెద్దలు తగు చర్యలు తీసుకోక పోవడం వలన రాములవారి భూములకు గ్రహణం పట్టింది. మొత్తం భూమిని కొంతమంది ఆక్రమించు కున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారిగా ఎల్ రమాదేవి భాద్యతలు చేపట్టిన నాటినుండి ఆ భూములకోసం చట్టపరమైన పోరాటం చేయడం ద్వారా ఆభూములు ఆలయ భూములని, వాటిని ఆలయానికి అప్పజెప్పాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎవ్వరు పట్టించుకోక పోవడం, తెలంగాణ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోక పోవడం వలన ఆ భూములకు గ్రహణం పట్టింది. భద్రాచలం ఆలయ అభివృద్ధికి ఎటువంటి నిధులు మంజూరు చేయక పోవడం వలన వచ్చే ఆదాయ వనరులతోనే మొక్కుబడిగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత బి ఆర్ ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి, నిరాదరణకు గురైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానం, భద్రాచలం ప్రాంతం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకి సంభందించిన ముగ్గురు ముఖ్యమైన నాయకులు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి లు ఉప ముఖ్య మంత్రి, మంత్రి పదవులలో ఉండడం భద్రాచలం ప్రాంతానికి, రామాలయ అభివృద్ధికి కృషి చేసేందుకు అవకాశం ఉంది. మంత్రులు గా ఉన్న వీరు గతంలో జరిగిన నిరాదరణ మరోమారు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు, పట్టణ ప్రజలు కోరుకంటున్నారు.

# ఎంపీగా ఈటెల రాజేందర్‌కు ఓటమి ఖాయమా.?



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బిజెపి నాయకుడు ఈటెల రాజేందర్ కు మల్కాజిగిరి పార్లమెంటు టికెట్ కేటాయించడంతో ఓటమి

- ఈటెల కు మల్కాజిగిరి టికెట్ వద్దు అంటున్న బిజెపి నాయకులు
- బిజెపి పార్టీలో చేరాక ఈటెల రాజేందర్ చేసింది ఏముంది.?
- తనను నమ్ముకుని వచ్చిన వారు కూడా పార్టీని వీడారు
- ఈటెల రాజేందర్ కు ప్రచార బాధ్యత అప్పగిస్తే పది సీట్లు అయిన గెలవచ్చు

చెందడం ఖాయమని మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో అతను చేసింది ఏమీ లేదని ఇప్పుడు కొత్తగా అతనికి మల్కాజిగిరి టికెట్టు అధిష్టానం కేటాయించడం తో బిజెపి పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాజేందర్ కు మల్కాజిగిరి టికెట్టు కేటాయిస్తే మాత్రం పార్టీ ఇక్కడ ఓటమి చెందడం ఖాయమని బిజెపి పార్టీ కార్యకర్తలు గుసగుసలు పెడుతున్నారు. బిజెపి పార్టీలో ఈటెల రాజేందర్ చేరాక తాను పార్టీకి చేసింది

ఏమీ లేదని తనను నమ్ముకుని వచ్చిన ఎంతో మంది నాయకులు పార్టీని వీడి వేరే పార్టీలోకి వెళ్లారని, పట్టుమని పదిమంది పెద్ద నాయకులను పార్టీలోకి తీసుకురాకుండా పార్టీలో అంతర్గత కలహాలను సృష్టించి తాను అనుకున్నది సాధించాలని అనుకున్నాడే తప్ప పార్టీని బలోపేతం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి దోహదపడలేదని పేర్కొంటున్నారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై పోటీ చేసి తనను ఓడిస్తానని కల్లబొల్లి మాటలు పలికి ఓటమి ఎరుగని ఈటెల రాజేందర్ హుజురాబాద్ లో ఓటమి చెందాడంటే ఇంతకంటే నిదర్శనం ఏమిటని బిజెపి నాయకులు ప్రశ్నిస్తున్నారు.నమ్మిన సిద్ధాంతాలను పక్కనపెట్టి తన రాజకీయ స్వభాలానికి ఈటెల రాజేందర్ ఎక్కువగా చూసుకుంటున్నారు తప్ప బిజెపి పార్టీ బలోపేతానికి ఎక్కడ పనిచేసిన దాఖలాలు లేవని మల్కాజిగిరి పార్లమెంటు స్థానాన్ని ఈటెల రాజేందర్ కు పార్టీ అధిష్టానం కేటాయించడంతో మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో బిజెపి పార్టీ ఓటమి చెందడం ఖాయమని పార్టీ నాయకులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెండు చోట్ల పోటీ చేసి ఘోరంగా ఓటమిపాలైన ఈటెలకు ఎంపీ టికెట్ ఎలా ఇచ్చారో అధిష్టాన పెద్దలకే తెలవాలని ఇప్పుడు కూడా మల్కాజ్గిరి ఎంపీ టికెట్ ఇచ్చి పెద్ద పొరపాటు చేశారని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అధిష్టానం ఆలోచించి పార్టీకి కష్టపడిన వారికి మల్కాజిగిరి పార్లమెంటు స్థానాన్ని కేటాయించాలని ఈటెల రాజేందర్ ను రాష్ట్రవ్యాప్తంగా ప్రచారానికి వాడుకుంటే బిజెపి పార్టీ తెలంగాణలో చాలా స్థానాలు గెలుపొందుతుందని సీనియర్లు జూనియర్లు అని చూడకుండా ప్రతి ఒక్కరు బిజెపి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని బిజెపి పార్టీ కి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి 10 సీట్లయినా గెలిచే విధంగా అందరూ కృషి చేయాలని అధిష్టానం ఆలోచించి బలమైన నాయకుడికి మల్కాజిగిరి పార్లమెంటు సీటును కేటాయించాలని, ఇక్కడి ప్రజలతో సంబంధంలేని నాయకుడికి మల్కాజిగిరి పార్లమెంటు సీటును ఇవ్వొద్దని పార్టీ నాయకులు అధిష్టానాన్ని కోరుతున్నారు.

# కాళేశ్వరంలో అవినీతి అక్రమాలు నిజం

- కాగ్, విజిలెన్స్ సంస్థలు నిగ్గు తేల్చాయి
- అయినా ఎందుకు ఉపేక్షిస్తున్నారు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బండి ప్రశ్న



**కరీంనగర్ (ప్రశ్న న్యూస్):** కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అక్రమాలు జరిగాయని కాగ్, విజిలెన్స్ సంస్థలు తేల్చినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కై దొంగాట ఆడుతూ ప్రజలను మభ్యపెడు తున్నాయని మండిపడ్డారు. శనివారం కరీంనగర్ జిల్లాలో ప్రజాహిత యాత్రలో భాగంగా జమ్మికుంట మండలం శాయంపేటలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కోరితే కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు. విచారణ పేరుతో కాంగ్రెస్ జాప్యం చేస్తూ.. 6 గ్యారంటీల అమలు అంశాన్ని పక్కదోవ పట్టిస్తుందని ఆరోపించారు. ఇచ్చిన మాట మేరకు వంద రోజుల్లో 6 గ్యారంటీల ను అమలు చేసి తీరాల్సిన బాధ్యత కాంగ్రెస్ పై ఉందన్నారు బండి సంజయ్. తెల్ల రేషన్ కార్డు ఉన్నా.. రూ.500లకు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలులో కోత పెడుతున్నారని.. రాష్ట్రంలో 90 లక్షల రేషన్ కార్డు కుటుంబాలుంటే.. 50 లక్షల కుటుంబాలకు కోత పెట్టడం అన్యాయమన్నారు. వినీతిని కప్పిపుచ్చుకునేందుకు బీఆర్ఎస్ సైతం.. 6 గ్యారంటీల హామీల అమలు కోసం నిలదీయలేక పోతోందని అన్నారు. హైదరాబాద్ నుండి కరీంనగర్, రామగుండం రహదారిపై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి కేంద్రం రక్షణ భూములివ్వడం హర్షణీయమని సంజయ్ అన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధిపై దృష్టి పెడితే కేంద్రం ఏ విధంగా సహకరిస్తుందో.. ఇదే నిదర్శనమన్నారు. గత బీఆర్ఎస్ సర్కార్.. కేంద్రాన్ని తిట్టడానికే పరిమితమైందే తప్ప ఏనాడూ అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా..కాంగ్రెస్ ఆరోపణలకే పరిమితమైతే తెలంగాణ ప్రజలు నష్టపోతారన్నారు.తెలంగాణ అభివృద్ధికి కేంద్రం పూర్తిగా సహకరించేందుకు సిద్ధంగా ఉందని.. 10 ఏళ్లలో తెలంగాణలో దాదాపు రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చిందని బండి సంజయ్ చెప్పారు. కేంద్రంలో మోదీని మళ్లీ ప్రధానిని చేస్తేనే శక్తివంతమైన భారత్ రూపుదిద్దుకుంటుందన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి 350కిపైగా ఎంపీ సీట్లు వస్తాయన్నారు. తెలంగాణలో 17కు 17 ఎంపీ సీట్లు గెలుచుకుంటామనే నమ్మకం ఉందని సంజయ్ చెప్పారు.

# మేడిగడ్డపై ముందే ఎందుకు మేల్కోలేదు

- నిర్వాసితుల గురించి ఎందుకు మాట్లాడలేదు
- కాళేశ్వరంపై కెసిఆర్ క్షమాపణలు చెప్పాలి
- నిపుణుల సూచనల మేరకే మేడిగడ్డ మరమ్మత్తులు
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

**మంథని (ప్రశ్న న్యూస్):** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడు నెలలు పూర్తి కాకముందే.. ఆరు గ్యారంటీల్లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ, సబ్సిడీ గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్‌ను అమల్లోకి తీసుకొచ్చామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. హామీల అమలు భారాస నేతలకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. పెద్దపల్లి జిల్లా మంథనిలో 'గృహ జ్యోతి' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుతో పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు చుక్కనీరు రాలేదన్నారు. ఇప్పటికైనా భారాస నేతలు మేడిగడ్డను సందర్శించారు. ప్రాజెక్టు సురక్షితం కాదని మేం కాదు.. జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ అధికారులే చెప్పారు. దీని నిర్మాణానికి రూపకల్పన చేసిన కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. మేడిగడ్డ మరమ్మతులు నిపుణుల సూచన మేరకు జరుగుతాయి. వారు వీరు చెప్పారని.. సలహాలపై మరమ్మతులు చేపడితే ప్రాజెక్టు మళ్లీ కుంగిపోతుంది. ఇంజినీర్లు, నిపుణుల సూచనల కోసం ప్రభుత్వం వేచిచూస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. రాజకీయంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదజల్లేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వెళ్లాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ప్రాజెక్ట్ సందర్శనలో కనీసం భూ నిర్వాసితుల సమస్యలపై ఎందుకు మాట్లాడ

లేదన్నారు. మేడిగడ్డ నష్టానికి కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉండగా కాళేశ్వరం ప్రాజెక్ట్ రక్షణ, మరమ్మత్తుల కోసం చర్యలు ఎందుకు చేపట్టలేదో కేటీఆర్ ప్రజలకు చెప్పాలన్నారు. ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందలేన్నారు. ప్రాజెక్ట్ రక్షణ చర్యలపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఇంజినీర్ల సూచనలతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. విడతల వారీగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. మంథని వద్ద రెండు జిల్లాలో పరిధిలో గోదావరిపై బ్రిడ్జి నిర్మిస్తున్నామన్నారు.

# పదేళ్ల బీఆర్ఎస్ కష్టానికి ఫలితం దక్కింది

## - రక్షణశాఖ భుమూలా అప్పగింతపై కేటీఆర్

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** అధికారంలోకి వచ్చిన క్షణం నుంచి పదేళ్ల పాటు ప్రజల ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు బీఆర్ఎస్ చేసిన సుదీర్ఘ పోరాటం ఫలించడం సంతోషంగా ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్-కరీంనగర్ రాజీవ్ రహదారి, హైదరాబాద్-నాగపూర్ జాతీయ రహదారి రూట్లలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి రక్షణ శాఖ భూములు ఇవ్వడానికి కేంద్రం పచ్చజెండా ఊపడం పట్ల కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయమని గుర్తుచేశారు. గత ఏడాది జూలై 31న జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం వీటిపై నిర్ణయం తీసుకుందని, దానికి అనుగుణంగా కేంద్రం ఆమోదం తెలపడం హర్షించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. గతంలోనే రక్షణశాఖ తమ ఆధీనంలోని 33 ఎకరాలను కేటాయించిందని, ఇప్పుడు మరో 150 ఎకరాలను కూడా అప్పగించేందుకు ముందుకు రావడంతో స్కైవేల నిర్మాణానికి ఉన్న అన్ని అడ్డంకులు తొలగిపోయాయని కేటీఆర్ వెల్లడించారు. ఈ రెండు రూట్లలో రక్షణ శాఖ భూములు ఉండటం వల్ల ఇంతకాలం రోడ్ల విస్తరణ సాధ్యం కాకపోవడం, దశాబ్దాల పాటు ప్రభుత్వాలు ఫ్లైఓవర్ల నిర్మాణానికి చొరవ తీసుకోకపోవడంతో.. ప్రజలు ట్రాఫిక్ సమస్యతో ఇంతకాలం ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అందుకే 2014 లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ రెండు మార్గాల్లో ఎలివేటెడ్ ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం అనేక కీలక ప్రణాళికలు రూపొందించామని, కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అన్ని నిరంతర సంప్రదింపులు జరిపామని తెలిపారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588